ప్రజాశక్తి

శుక్రవారం 2 ఆగస్టు 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

పాల రైతు సదుపాయాల కోత

విశాఖ డెయిరీ (ఫైల్‌ఫొటో)

- విశాఖ డెయిరీ కొత్త నిబంధనలు
- గతంలో బోనస్ నిలిపివేత
- తాజాగా మరణ పరిహారం తగ్గింపు
- అన్యాయమైపోతామన్న రైతులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, మునగపాక విలేకరి

విశాఖ డెయిరీ పాల రైతుల సదుపాయాలకు కోత పెడుతోంది. వారి సంక్షేమాన్ని క్రమంగా గాలికొదిలేస్తోంది. డెయిరీకి పాలు పోస్తున్న రైతును ప్రోత్సహించకపోగా గతంలో ఉన్న సదుపాయాలను తగ్గిస్తోంది. పాల రైతుకు వర్తించే ఇన్సూరెన్స్‌ను ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి రైతు పోసిన పాల ఆధారంగా పరిహారం వర్తించేలా నిబంధనలు మార్చింది. ఈ ఏడాది ఫిబ్రవరి 26న జరిగిన విశాఖ డెయిరీ బోర్డు సమావేశం పాలు పోస్తున్న పాడి రైతుకు అమలుచేస్తున్న మరణ పరిహార నిబంధనలను మార్చుతూ తీర్మానం చేసింది. గతంలో పాల రైతుకు బోనస్ నిలిపివేసిన డెయిరీ యాజమాన్యం.. తాజాగా పరిహారం చెల్లింపులో విధించిన షరతులతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి రహస్యంగా అమలు చేయాలనుకున్న నూతన నిబంధనలు బయటకు రావడంతో పాల రైతులు కలవరం చెందుతున్నారు.

డెయిరీ నిబంధనలు ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని మూడు లక్షల మంది పాల రైతులకు సమస్యగా మారాయి. ఎవరికి పరిహారం వర్తిస్తుందో, ఎవరికి వర్తించదో తెలీని పరిస్థితి నెలకొంది. పాలు పోసిన రైతు చనిపోతే వారసులకు మరణ పరిహార సొమ్ము కచ్చితంగా వస్తుందన్న ఆశ ఇప్పుడు లేకుండాపోయింది.

పాల ఉత్పత్తిదారుల వారసులకు మరణ పరిహారం చెల్లించడానికి గత మూడేళ్లలో ఏ ఒక్క సంవత్సరమూ పాల కేంద్రానికి పోసే పాలు 200 లీటర్లకు తగ్గకూడదన్న నిబంధనను తప్పనిసరిచేసింది. మరణించిన పాడిరైతుకు సుఖీభవ కార్డు, వయస్సు 60, ఆపైన వుండాలని, వారసులు విధిగా పాలను సరఫరా చేయాలని నిబంధనలు విధించింది. కొత్త నిబంధనల ప్రకారం అర్హత కలిగిన పాడి రైతు వారసులకు చెల్లించే మరణ మిగతా 2లో..

సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడుకు విరాళం అందజేస్తున్న పానీపూరి వర్తకుడు

వయనాడ్ బాధితుల కోసం

సిపిఎం విరాళాల సేకరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేరళలోని వయనాడ్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు కొండ చరియలు విరిగి వందలాది మంది ప్రాణాలు కోల్పోయారని, అనేక కుటుంబాలవారు నిరాశ్రయులయ్యారని, వారిని మానవతా దృక్పథంతో ఆదుకోవాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో గురువారం జగదాంబ సెంటర్‌లో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేనంతగా ప్రకృతి విలయ తాండవం చేసిందని, భారీ కొండ చరియలు, పెద్ద పెద్ద బండరాళ్లు దొర్లుకుంటూ వచ్చి కుటుంబాల కుటుంబాలను నిద్రలోనే మృత్యువాతకు గురిచేశాయని తెలిపారు. ఈ ఘటన దేశ ప్రజల హృదయాలను కలిచివేసిందన్నారు. కేరళ ప్రభుత్వం, ప్రజలు స్వచ్ఛందంగా యుద్ధ ప్రాతిపదికన పునరావాస, సహాయ చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ప్రజలు కష్టాల్లో వుంటే వారికి సహాయం చేయాల్సిన కేంద్ర బిజెపి ప్రభుత్వం దీన్ని రాజకీయం చేయడం హేయమైన చర్యని అన్నారు. ఆపదలో వున్న వయనాడ్ ప్రజానీకానికి సహాయంగా యావత్ ప్రజానీకం నిలబడాలని కోరారు. విరాళాల సేకరణలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, కార్పొరేటర్ మిగతా 2లో..

మాంగనీస్ దిగుమతిలో విశాఖ పోర్టు సరికొత్త రికార్డు

వార్త 8లో..

ముగిసిన టేబుల్ టెన్నిస్ పోటీలు

వార్త 2లో..

కానిస్టేబుల్‌పై దాడి కేసులో నిందితుడు అరెస్టు

వార్త 2లో..

పురస్కార ప్రదానోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న తనికెళ్ల భరణి

ఘనంగా రంగసాయి అవార్డుల వేడుక

తనికెళ్ల భరణికి జీవన సాఫల్య పురస్కారం అందజేత

వార్త 2లో..

కెకె లైన్‌లో దంతెవాడ వరకే రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కెకె లైన్‌లోని కిరండూల్ ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పలు రైళ్లను షార్ట్ టర్మినేట్ చేస్తున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. ఈ క్రమంలో 08551 విశాఖపట్నం-కిరండూల్ ప్యాసింజర్, 18514 విశాఖపట్నం-కిరండూల్ ఎక్స్‌ప్రెస్‌లను ఆగష్టు 1 నుండి 7 వరకు దంతెవాడలో షార్ట్ టర్మినేట్ చేయనున్నారు, అదేవిధంగా 08552 కిరండూల్-విశాఖపట్నం ప్యాసింజర్, 18513 కిరండూల్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ ఆగష్టు 2 నుండి 8 వరకు కిరండూల్‌కు బదులుగా దంతెవాడ నుంచి ప్రారంభమవుతాయి. కావున ఈ తేదీల్లో కిరండూల్-దంతెవాడ మధ్య ఈ రైలు సేవలు ఉండవని, ప్రజలు మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ సీనియర్ డిసిఎం సందీప్ తెలిపారు.

జివిఎంసి స్టాండింగ్ కమిటీ ఎన్నికలే అజెండా

వైసిపి అధినేత జగన్‌ను కలిసిన పార్టీ విశాఖ జిల్లా నేతలు

జగన్‌తో కార్పొరేటర్లు, వైసిపి నేతలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఈ నెల 7న జరుగనున్న జివిఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నికల సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహంపై జివిఎంసికి చెందిన పలువురు వైసిపి కార్పొరేటర్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులుతో కలిసి గురువారం అమరావతికి వెళ్లి మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్.జగన్‌ను కలిశారు. తాజా రాజకీయ పరిణామాలను చర్చించారు. జగన్ కార్పొరేటర్లు, నాయకుల్లో మనోధైర్యం నింపినట్టు గురువులు మీడియాకు వెల్లడించారు. అత్యధిక సీట్లు తామే కైవసం చేసుకోగలమన్న ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తం కార్పొరేటర్లలో 48కి పైగానే తమవైపు ఉన్నారని గురువులు 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఇటీవల కొద్దిమంది వైసిపి కార్పొరేటర్లు టిడిపి కూటమిలో చేరినా వారంత సంతృప్తిగా లేరని చెప్పారు.

వ్యూహప్రతివ్యూహాల్లో పార్టీలు

ఈ నెల 7న మొత్తం 10 మంది స్టాండింగ్ కమిటీ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంది. అటు వైసిపి, ఇటు కూటమి పార్టీలకు చెందిన వారెవరికీ ఏకపక్షంగా స్థాయీ సంఘ ఎన్నికల్లో గెలుపు దక్కే అవకాశం కనిపించడం లేదు. సరిసమానంగా కార్పొరేటర్లు ప్రధాన పార్టీలకు ఉన్నారు. నామినేషన్లకు సంబంధించి 20 మంది ఇప్పటివరకూ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

పాల రైతు సదుపాయాల కోత

పరిహారం తగ్గించి చెల్లించనుంది.

మూడేళ్లలో ఏడాదికి సగటున 200 లీటర్లకు పైబడి పాలు పోసిన రైతుకు డెయిరీ నుంచి మూడు వేలు, 500 లీటర్లు పైబడి పాలు పోసిన రైతుకు రూ.7,500, 750 లీటర్లు పైబడి పాలు పోసిన రైతుకు రూ.పది వేలు, వెయ్యి లీటర్లు పైబడిన రైతుకు రూ.15 వేలు చొప్పున డెయిరీ పరిహారం ఇవ్వనుంది. నూతన నిబంధనలు ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి వస్తాయని ఈ ఏడాది మార్చి 30న సర్క్యులర్ విడుదల చేసింది. పాలతో నిమిత్తంలేకుండా 60 ఏళ్ల దాటిన పాల రైతు చనిపోతే వారసులకు రూ.30 వేలు, 60 ఏళ్లలోపు రైతు చనిపోతే లక్షల రూపాయలు చెల్లించేవారని మునగపాకకు చెందిన గణేష్ తెలిపాడు. రైతు పాల సరఫరాతో ఇన్సూరెన్స్ పరిహారాన్ని ముడిపెట్టడం వల్ల రైతు కుటుంబాలకు అన్యాయం జరుగుతోందని పాల రైతులు అంటున్నారు. రైతు ఇన్సూరెన్స్ చేసుకున్నా, ఏ ఏడాది పాల సరఫరా తగ్గినా మరణించిన రైతు వారసులకు పరిహారం వర్తించదని వాపోతున్నారు. గతంలో బోనస్ చెల్లింపును డెయిరీ ఆపేయడంతో ఏడాదికి రూ.12 వేలు నష్టపోయామని తిమ్మరాజుపేట పాల రైతు శరగడం శ్రీనివాసరావు తెలిపాడు. ఇదే విషయమై విశాఖ డెయిరీ ఎమ్‌డి ఎస్‌వి.రమణ మాట్లాడుతూ సొసైటీలో పాలు పోసి మరణించిన రైతు కుటుంబాలకు సొసైటీ డబ్బులకు, డెయిరీ కొంత సొమ్ము కలిపి మానవతా దృక్పథంతో సాయం చేసేదని అన్నారు. డెయిరీ సాయం తగ్గించలేదని, సొసైటీ నుంచి డబ్బులు ఇవ్వడంలేదని అన్నారు.

సిపిఎం విరాళాల సేకరణ

డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుబ్బారావు, యుఎస్ఎన్.రాజు, నాయకులు వై.రాజు, జి.అప్పలరాజు, వి.తులసీరాం, కెవిపి.చంద్రమౌళి, కె.నరసింగరావు, అప్పారావు, కె.కుమారి, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం జోన్ ఆధ్వర్యాన...

సిపిఎం కంచరపాలెం జోన్ ఆధ్వర్యాన ప్రజల నుంచి విరాళాలు సేకరించారు. ప్రజలు ఉదారంగా స్పందించారు. పార్టీ జోన్ కార్యదర్శి బొట్టా ఈశ్వరమ్మ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు బి.పద్మ, జోన్ నాయకులు ఒ.అప్పారావు, పి.రామారావు, పిట్టా మూర్తి, సూర్యనారాయణ, ఒ.విజయ, కొండ, కుమారి పాల్గొన్నారు.

జివిఎంసి స్టాండింగ్ కమిటీ ఎన్నికలే అజెండా

దాఖలు చేశారు. 3వ తేదీకి ఎవరు బరిలో ఉంటారో తేలనుంది. 49 మంది ఒకవైపు ఉంటే అత్యధిక స్థాయీ సంఘ సభ్యులను ఆ పార్టీ సొంతం చేసుకుంటుంది. కూటమి పార్టీలు తమ బలాన్ని పెంచుకునే ప్రయత్నంలో నిమగ్నమయ్యాయి. అధికారం చేతిలో ఉండడంతో అన్ని శక్తులను ఒడ్డి స్థాయీ సంఘాన్ని తమ గుప్పెట పెట్టుకోవాలన్న కాంక్షతో పావులు కదుపుతున్నా సరే టిడిపిలో ఉన్న ఇద్దరు కార్పొరేటర్లు వైసిపిలో ఇంకా కొనసాగుతుండడం చూస్తే వైసిపి గెలిచినా ఆశ్చర్యపోవక్కర్లేదని పలువురు చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో సిపిఎం, సిపిఐకి ఉన్న చెరో కార్పొరేటర్ కీలకంగా మారారు. అయితే ఇప్పటికే సిపిఎం 78వ వార్డుకు చెందిన కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ స్థాయీ సంఘ ఎన్నికలు కేవలం ఆర్థికంగా జివిఎంసిలో కాంట్రాక్టులు దక్కించుకోవడానికి, నిధులు కొల్లగొట్టడానికే తప్ప నగర ప్రజల బాగోగుల కోసం లేవని ఎద్దేవా చేశారు. తాము ఈ ఎన్నికల్లో పాల్గొనడం లేదని, స్టాండింగ్ కమిటీ ఎన్నికల ఓటింగ్‌ను బహిష్కరిస్తున్నామని ఆయన ప్రకటించిన విషయం తెలిసిందే.

సెవెన్ హిల్స్ కార్మికుల బకాయి జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సెవెన్ హిల్స్ హాస్పిటల్‌లో పనిచేసి రిటైర్ అయిన కార్మికులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, అలాగే 15 రోజుల బకాయి జీతాలు చెల్లించాలని విశాఖ జిల్లా హాస్పిటల్ అండ్ నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి వై.రాజు డిమాండ్ చేశారు. గురువారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బకాయి ఉన్న 15 రోజుల జీతాలు చెల్లిస్తామని లేబర్ కమిషనర్ సమక్షంలో సెవెన్ హిల్స్ హాస్పిటల్ యాజమాన్యం అంగీకరించిందని, ఆ హామీని అమలు చేయాలని కోరారు.

సెవెన్ హిల్స్ హాస్పిటల్ యాజమాన్యం చట్ట వ్యతిరేక కక్ష సాధింపు చర్యలను విడనాడాలన్నారు. రిటైర్డ్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్లు చెల్లించడంలో తీవ్ర కాలయాపన చేయడం అమానుషమని తెలిపారు. బెదిరింపులు మానుకోవాలన్నారు. విశాఖ వంటి కార్మిక నగరంలో లేబర్ డిపార్టుమెంట్‌లో ఇటువంటి హాస్పిటల్స్ కార్మికుల సమస్యలను చూడవలసిన జెసిఎల్ వంటి ఉన్నతోద్యోగి చాలాకాలంగా లేరన్నారు.

తక్షణం ఆ పోస్టును భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హాస్పిటల్ రిటైర్డ్ వర్కర్స్ గండి విలియం, వి.లక్ష్మి, బి.పార్వతి, డి.లక్ష్మణ పాల్గొన్నారు.

ఘనంగా రంగసాయి అవార్డుల వేడుక

తనికెళ్ల భరణికి జీవన సాఫల్య పురస్కారం అందజేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రంగసాయి నాటక రంగం 14వ వార్షికోత్సవం సందర్భంగా రంగసాయి థియేటర్ అవార్డుల - 2024 కార్యక్రమం గురువారం సాయంత్రం మద్దిలపాలెంలోని కళాభారతిలో ఘనంగా జరిగింది. నటుడు, రచయిత, దర్శకుడు తనికెళ్ల భరణికి జీవన సాఫల్య పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా తనికెళ్ల భరణి మాట్లాడుతూ సినీ రంగానికి తల్లి వంటి నాటక రంగం నుండి అవార్డు పొందడం ఎంతో ఆనందంగా ఉందని, నాటక రంగాన్ని ప్రోత్సహిస్తున్న రంగసాయి నాటక సంఘం వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి అభినందనీయుడని అన్నారు. తన కెరియర్ ప్రారంభ దశలో ఉన్న సమయంలో నాటక రంగంపై ఉన్న మక్కువతో తాను సురభి సంస్థ రూపొందించిన పలు నాటకాల్లో నటించానని ఆయన గుర్తు చేసుకున్నారు. అనంతరం సినీ నటుడు ప్రియదర్శి మాట్లాడుతూ తనికెళ్ల భరణిని ఆదర్శంగా తీసుకుని చిన్ననాటి నుండి ఎదిగానని, అప్పట్లో ఆయన రచించిన చల్ చల్ గుర్రం నాటకాన్ని షార్ట్ ఫిల్మ్‌గా నిర్మించామని అన్నారు. పలు భాషల్లో నటిస్తూ తెలుగు సినీ రంగాన్ని అత్యున్నత స్థాయికి భరణి తీసుకువెళ్లారని అన్నారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా ప్రముఖ రంగస్థల కళాకారులు ఎస్ఎం.బాష, బివి.రామారావు, వి.సతీష్ కుమార్, కె.మంగాదేవి, బాలనటుడు బగాది రితేష్ చంద్‌లకు రంగసాయి థియేటర్ అవార్డ్స్ అందించారు. ఈ కార్యక్రమంలో విజయ నిర్మాణ సంస్థ అధినేత విజయ్ కుమార్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, మాజీ శాసన సభ్యులు దాడి వీరభద్రరావు, లీడర్ సంపాదకులు వివి.రమణమూర్తి, పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణ ప్రసాద్, కళాభారతి అధ్యక్షుడు ఎంఎస్ఎన్.రాజు, సినీ దర్శకుడు ఇంద్రగంటి మోహన్‌కృష్ణ, సెన్సార్ బోర్డ్ పూర్వ సభ్యులు సంధ్య కిషోర్ పాల్గొన్నారు.

ముగిసిన టేబుల్ టెన్నిస్ పోటీలు

పోటీల్లో పాల్గొన్నవారితో అతిథులు, నిర్వాహకులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెంలోని మాచిరాజు టేబుల్ టెన్నిస్ అకాడమీలో బుధవారం నుంచి తలపెట్టిన టేబుల్ టెన్నిస్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు డివిఎస్‌వై.శర్మ హాజరై గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో మాచిరాజు టేబుల్ టెన్నిస్ అకాడమీ వ్యవస్థాపకులు కృష్ణమూర్తి, విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ సభ్యులు మురళి, వివిఎస్ఎన్.మూర్తి, డిఎస్‌ఎ కోచ్ అచ్యుత కుమార్, మాచిరాజు టేబుల్ టెన్నిస్ అకాడమీ సభ్యులు శ్రీకాంత్, రోహిత్, భాను పాల్గొన్నారు.

విజేతలు వీరే

అండర్-9 బాలికల విభాగంలో శ్రేయంక, బాలుర విభాగంలో అమర్ సాహిల్, అండర్ - 11 బాలికల విభాగంలో పూజిత, బాలుర విభాగంలో ఆర్యన్ గోపాల్, అండర్-13 బాలికల విభాగంలో సహిత శ్రీ, బాలురు విభాగంలో బాలాజీ, అండర్-15 బాలికల విభాగంలో సహిత శ్రీ, బాలుర విభాగంలో లిఖిత్ మోహన్, అండర్-17 ఓపెన్ విభాగంలో శ్రేయేష్, ఓపెన్ విభాగంలో మహీధర్ వర్మ విజేతలుగా నిలిచారు.

విశాఖ నగరాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖలో మౌలిక వసతులతో పాటు ఐటి, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి తాను కృషి చేస్తానని దక్షిణ ఎమ్మెల్యే సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. గురువారం తెలుగు శక్తి ఆధ్వర్యంలో దసపల్ల హోటల్‌లో బాబు పాలన-రాష్ట్ర పురోగతి అన్న అంశంపై జరిగిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధిపై ఇంకా అధ్యయనం కొనసాగుతోందన్నారు. సదస్సుకు తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి సర్కారు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందన్నారు. ఆ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యబద్ధంగా తాను పోరాడుతూ వచ్చానని చెప్పారు. మాజీమంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ విశాఖపట్నంలో ప్రభుత్వ కార్యాలయ భవనాలను తాకట్టు పెట్టిన ఘనుడు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని ఆరోపించారు. కార్యక్రమంలో సోషల్ డెమోక్రటిక్ ఫ్రంట్ (అమరావతి) అధ్యక్షులు గురునాథం, శ్రీనివాసానంద స్వామి, నాగార్జున యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ వి.బాలమోహన్‌దాస్, ఎయు మాజీ రిజిస్ట్రార్ వెలగపూడి ఉమామహేశ్వరరావు, జనసేన కార్పొరేటర్ కందుల నాగరాజు, పాలూరి శేషమాంబ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై దాడి కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గత నెల 29వ తేదీ సాయంత్రం ఎంవిపి పోలీస్ స్టేషన్ పరిధిలో కానిస్టేబుల్‌పై జరిగిన దాడి కేసులో నిందితుడైన కొర్రయ విజయ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు ఎంవిపి పోలీస్ స్టేషన్ (లా అండ్ ఆర్డర్) సిఐ జి.సంజీవరావు తెలిపారు. గురువారం ఉదయం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వివరించారు. నిందితునిపై గతంలో 9 కేసులు ఉన్నట్టు తెలిపారు. ఈ క్రమంలో అతనిపై రౌడీ షీట్ కూడా ఓపెన్ చేశామన్నారు. మీడియా సమావేశంలో లా అండ్ ఆర్డర్ ఎస్ఐ మహంతి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

My clients 1. **Gurjala Jayachandra Naidu** through facilitator **Lukalapu Krishna rao** entered into a 'Memorandum of Understanding' on 30-12-2022 with 1. **Meda Nagabhushanam** and 2. **K. Pullareddy** for mutation of the names of my clients in Revenue and GVMC records and to obtain pass books together with NOC in the names of my clients and also to clear all disputes, in respect of the below mentioned schedule property on or before 31-03-2023. However, the said Nagabhushanam and Pullareddy failed to comply the conditions of the said MOU within the stipulated period. Therefore, the public are hereby informed that the said 'Memorandum of Understanding' dated 30-12-2022 is already terminated even by 31-03-2023 and the said Meda Nagabhushanam and K. Pullareddy are no longer connected or concerned either to the said MOU or to the below mentioned Schedule Property. Therefore, further no person should enter in to any transaction of whatsoever in respect of the said subject property with said persons or any representative of them and in case persons enters in to any agreement understanding or transactions with the said persons with respect to the property the same shell not be binding upon my client and would be entirely their risk, cost and consequences. All the pieces and parcel of vacant land totally measuring an extent of **Ac 44.90 cents** in **S. No. 26C** covered by **Patta No.26, China Gadili Mandal, Mudasarlove Village, Visakhapatnam.**

A.V. SURYANARAYANA
Advocate
Visakhapatnam, Mobile No. 99850 26481

IN THE HONOURABLE COURT OF THE VI ADDITIONAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
O.S.No. 436/2022

Between:
Malladi Muralidhar . . . Plaintiff
And:
Tekumudi Srinivasa Rao . . . Defendant

SUMMONS TO THE DEFENDANT

To
Tekumudi Srinivasa Rao,
S/o. Surynarayana, Hindu, aged about 49 years, Business, Managing Director, M/s. Shangee Granites Impex Pvt Ltd., (Formerly known as Shangee Mantech Solutions Pvt Ltd.,) Resident of D.No. 10-65/1, G-1, Sri Nidhi Group House, Shiva Gayatri Nagar, Papayyaraju Palem, Visakhapatnam-531 173.

Please take summons that the above Suit filed against you and the above Case. stands posted to 19-08-2024.

You are hereby summoned to appear either in person or through an Advocate in the above mentioned Honourable Court at **10.30 A.M. on 19-08-2024** falling which the matter will be heard and decided in your absence.

(By Order of the Court)
V.SATYA NARAYANA SASTRY,
ADVOCATE
Rednam Plaza, 4th floor, 2" Lane, Dwarakanagar, Visakhapatnam-530016.
Visakhapatnam Cell : 9849170535.
Dt. 01-08-2024

CPC ఆర్డర్ 21 రూల్ 34 ప్రకారం నోటీసు
మహారాజశ్రీ అనకాపల్లి అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి (FTC) కోర్టులో
E.P. 53 / 2022 in O.S. 183 / 2005

డిక్రీహో: బొడ్డేడ అప్పలమణి మరి 1రు . . . D.Hrs
అండ్: పొన్నాడ వరహాలమ్మ (Died), వగైరాలు . . . J.Drs
టు: 3వ JDR : పొన్నాడ శ్రీనివాసరావు, తండ్రి లోవరాజు, కుంచావారివీధి, అనకాపల్లి.

పై నెంబరులో DHrs / వార్లు పేర దావా షెడ్యూల్ ఆస్తిని రి|| క్రయచీటి వ్రాయించుకోర్ మీపైని, మిగతా వారిపైన వేసిన దావా తే: 22-11-2017దిని డిక్రీకాబడినది. సదరు డిక్రీ షరతుల ప్రకారం డిక్రీషెడ్యూల్ ఆస్తిని మీరు, మిగతా JDrs కలిసి DHrs పేర రి|| క్రయచీటి వ్రాయించుకోర్ వేసిన పై అమలు పిటీషను మీ హాజరు నిమిత్తం శ్రీకోర్టు వారు **తే: 13-8-2024దీకి** వాయిదా వేసియున్నారు. కావున ఆరోజు **ఉదయం 10-30 ని||లకు** మీరు స్వయంగా గాని, మీ తరఫున లాయరు గారు గాని పైకోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు పై అమలు తీర్మానించబడును.

ఎన్.డి.జగన్నాధరాజు, వై.సాయిరాం, వై.ఎన్.రాము
అడ్వకేట్స్, అనకాపల్లి.

NOTICE

IN THE COURT OF THE HON'BLE II ADDL. DIST.JUDGE::GUNTUR
I.A No:136 / 2024, I.A.No.137/2024 & I.A.No.138 / 2024 in O.S.No:409 / 2014

Between:
1)Yenuganti Chechaiah(Died), 2)Nalluri Damodara & Others. .....Petitioners/ Plaintiffs
AND
Ahammad Ali Khan & Others. ...Respondents/ Defendants

To,
R-7: Ayesha Begum,W/o.late Khadar Ali Khan,
R-8: Niyaaz Ali Khan S/o late Khadar Ali Khan,
R-9: Riyaz Ali Khan,S/o. late Khadar Ali Khan,
All are R/o.HIG 1-25, Sagar Nagar, Near Sagar Arch, Visakhapatnam Urban, Visakhapatnam Dist. (Proposed Respondents 7 to 9)

పై నెంబరు దావాలో I.A No:136/2024,I.A No:137/2024 & No:138/2024 పిటిషనులలో 7నుండి 9 రెస్పాండెంట్స్ అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Substitute Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా,సదరు ఆర్డరు ప్రకారము మీరు **ది:08-08-2024న ఉ.గం.10-30 ని.లకు** పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కానీ, మీ అడ్వకేట్ ద్వారా గానీ హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును అని తెలియపర్చడమైనది.
(శ్రీ కోర్టు వారి అనుమతితో)
వాయిదా **తేది:08-08-2024**

GUTTA VR LAW ASSOCIATES
VANUKURI SRINIVASA REDDY,
VANUKURI VENKATA SUBBA REDDY,
Advocates for Petitioners/Plaintiffs,Opp.Dist.Court, Guntur,Cell: 9848342047,9177646766

పేదలకు న్యాయం చేయండి

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

ప్రజాశక్తి- పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు శివారు బర్ధన్ నగర్‌లో సర్వేనెంబర్ 185లో ఎనిమిదేళ్ల క్రితం పాకలు వేసి జీవనం సాగిస్తున్న 100 మందికి పైబడి నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వపరంగా న్యాయం చేయాలని సిపిఐ నగర కార్యదర్శి శ్రీను, నాయకులు రాంబాబు కోరారు. గురువారం పెందుర్తి తహశీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. బర్ధన్‌నగర్ వచ్చి అధికారులు పరిశీలించి, పేదలకు నిర్ధారించారని వివరించారు.
దీనిపై తహశీల్దార్ వేణుగోపాల్ స్పందిస్తూ, అప్పట్లో వేసిన పాకలను అలాగే ఉంచాలని, ఆయా స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు, మరమ్మతుల పేరిట పనులు చేపట్టవద్దని సూచించారు. ఆక్రమణల పరిశీలనకు ప్రత్యేక బృందాలతో పరిశీలిస్తున్నామన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని, తమ దృష్టికి వచ్చిన ఎవరినీ వదిలిపెట్టబోమని తహశీల్దార్ స్పష్టం చేశారు.

మొక్కు తీర్చుకున్న టిడిపి నేతలు

అప్పన్నకు మొక్కు తీర్చుకుంటున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి -మధురవాడ : సిఎంగా చంద్రబాబు, భీమిలి ఎమ్మెల్యేగా గంటా శ్రీనివాసరావు గెలుపుతోపాటు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని జివిఎంసి 7వ వార్డు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు చేసిన ముడుపులు సాకారం కావడంతో గురువారం ఉత్తరాంధ్ర ఇలవేల్పు సింహాద్రి అప్పన్నను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు సింహాద్రి అప్పన్న సన్నిధికి కొండమెట్ల మార్గంలో 21 మెట్లు మోకాళ్ళతో నడిచి, మిగిలిన మెట్లును కాలినడకన కొండెక్కి, అప్పన్నను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.తమ ఆకాంక్షలకు సింహాద్రి అప్పన్న సాకారం చేశారని, అందుకే మొక్కలు తీర్చుకున్నట్లు టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీ, టిడిపి నాయకులు మురళి, అచ్యుతరావు, ఈశ్వరరావు, వరలక్ష్మి, ఎన్.లక్ష్మి హసీనా, లీలా, కుమారి, సంతోషి, మహాలక్ష్మి, తాతారావు, గోపి, నాగోతి వాసు తెలిపారు.

జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదం

ప్రమాదంలో పాడైన కారు

ప్రజాశక్తి -గాజువాక: గాజువాక ఆటోనగర్ జాతీయ రహదారి సిగ్నల్ పాయింట్ వద్ద, కారును కాంక్రీట్ లారీ గురువారం ఢీకొంది. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జ య్యింది. ఘటన వివరాలివి. గాజువాక ఆటోనగర్ వైపు నుంచి నగరంవైపు జాతీయరహదారిలో కాంక్రీట్ మిక్చర్ లారీ, కారు రెండూ సమాంతరంగా ప్రయాణం సాగిస్తున్నాయి. ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద, బిహెచ్‌పివి వైపు లారీ లెఫ్ట్ యూటర్న్ తీసుకోగా, అదే సమయంలో కారు నడుపుతున్న వ్యక్తి కూడాయూటర్న్ తీసుకోవడంతో, ఎదురుగా వెళ్లే ఖాళీ లేకపోవడంతో కాంక్రీట్ లారీకి, డివైడర్‌కు మధ్య కారు చిక్కుకుని పూర్తిగా పాడైంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం, గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

గిరి ప్రదక్షిణ భక్తులకు సేవలందించిన

'విశ్వాస్' సంస్థకు ప్రశంసలు

ప్రజాశక్తి- ఆరిలోవ : గురు పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణ చేసిన భక్తులకు సేవలందించిన స్వచ్ఛంద సంస్థలను సింహాచలం దేవస్థానం అధికారులు గుర్తించి, ఉత్తమ సేవలు అందించిన వారిని గుర్తించి గురువారం ప్రశంసాపత్రాలు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఇందులో భాగంగా ముడసర్లోవ వద్ద భక్తులకు మజ్జిగ, మందులు, తాగునీరు, ప్రసాదాలు అందించిన విశ్వాస్ సంస్థకు కూడా దేవస్థానం ఇఒ సింగార శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ కార్యక్రమంలో ఉన్నతాధికారులు, ప్రముఖుల సమక్షంలో సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా విశ్వాస సంస్థ ప్రతినిధి ఎంవి రావు మాట్లాడుతూ 30ఏళ్లుగా ఏటా గిరిప్రదక్షిణ భక్తులకు తమ సంస్థ ద్వారా సేవలు అందిస్తున్నామన్నారు. తమ సేవలను గుర్తించి సర్టిఫికెట్ అందజేసి ప్రోత్సాహించిన దేవస్థానం పాలకమండలి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. గోపాలపట్నం ఎసిపి అన్నం నరసింహమూర్తి, డిఎంహెచ్ఒ డాక్టర్ తిరుపతిరావు అగ్నిమాపక అధికారి ప్రసాదరావు, ఆర్‌టిసి ఎండి రాజశేఖర్, దేవస్థానం ఎఇఒలు రమణమూర్తి, ఆనంద్ కుమార్, ఇఇలు శ్రీనివాసరాజు, రాంబాబు ఉన్నారు.

ప్రశంసాపత్రం అందుకుంటున్న విశ్వాస్ సంస్థ ప్రతినిధి

నేడు పలు గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి- వేపగుంట : 33/11కెవి సబ్‌స్టేషన్ పద్మనాభపురం పరిధిలోని బంటాకాలనీ 11కెవి ఫీడర్‌లో కొత్త విద్యుత్ లైన్ నిర్మాణం, ఇతర నిర్వహణ పనుల దృష్ట్యా ఈనెల 2న శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ మూడవ జోన్ ఇఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. బంటాకాలనీ, మేఘాద్రీగెడ్డ కాలనీ, అప్పలనరసయ్య కాలనీ, వెంకటసాయి నగర్, రవినగర్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మధురవాడ: పీఎం పాలెం 11కెవి ఫీడర్, పెప్సీ ఫీడర్ నిర్వహణ, మరమ్మతుల నేపథ్యంలో ఈనెల 2న శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ మూడోజోన్ డిఇ పి.శ్రీనివాసరావు తెలిపారు. గాయత్రి నగర్, జెఎన్ఎన్‌యుఆర్ఎం బ్లాక్స్, విజేత సూపర్ మార్కెట్ ఏరియా, 2వ బస్‌స్టాప్ ఏరియా, ఎపిహెచ్‌బి కాలనీ, కార్‌షెడ్ ఏరియా, పిలకవాని పాలెం, సాంకేతిక కాలేజ్ ఏరియా, పోస్ట్ ఆఫీస్ ఏరియా మొదలైన ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఆనందపురం :ఆనందపురం సబ్‌స్టేషన్ పరిధిలోని 11కెవి ఇండస్ట్రియల్ ఏరియా ఫీడర్‌లో మరమ్మతులు దృష్ట్యా ఈనెల 2న శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండలంలో వేములవలస,పెద్దిపాలెం, ఆనందపురం, ఎల్‌వి.పాలెం, ఎస్‌సి కాలనీలకు విద్యుత్ ఉండదని ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ విభాగం ఎఇఇ సురేష్ కుమార్ తెలిపారు.

సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు

నర్సింగరావును సత్కరిస్తున్న నేతలు

ప్రజాశక్తి -ఆనందపురం: విధి నిర్వహణలో ఉద్యోగులు అందించిన సేవలే వారికి ప్రజల్ల చిరస్థాయిగా గుర్తింపునిస్తాయని అనందపురం జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ అతిథి గృహంలో ఉద్యోగ విరమణ పొందిన వేములవలస గ్రామ కార్యదర్శి పురం నర్సింగరావు అభినందన సత్కారసభలో మాట్లాడారు. ప్రతిఒక్కరితో స్నేహభావంతో మెలుగుతూ, నర్సింగ రావు అందించిన సేవలు ప్రశంసనీయమని కొనియా డారు. కార్యక్రమంలో ఎంపిడిఒ అప్పలనాయుడు, డెంకాడ ఎంపిడిఒ అడపా లవరాజు, ఇఒపిఆర్‌డి రామారావు, వైసిపి మండల అధ్యక్షుడు బంక సత్య ం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వెల్లంకి గ్రామ కార్యదర్శి శ్రీరామ్మూర్తి (బాబి), కరుణాకరరావు, వేములవలస సర్పంచ్ లంక కొండమ్మ, ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వరరావు, మరుపిల్ల చిన్నయ్యపాత్రుడు, కోరాడ రాంబాబు, వార్డు సభ్యుడు సారికి విజయ్ కుమార్, పతివాడ గోపి, విఆర్ఒ స్వామి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

దమ్ము పొలంలో కౌలురైతు హఠాన్మరణం

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని పొట్నూరు గ్రామానికి చెందిన సంపంగి అప్పలరాజు(40) అనే కౌలురైతు గురువారం దమ్ము పొలంలోనే హఠాన్మరణం పొందాడు. మృతుడు అప్పలరాజు అదే గ్రామానికి చెందిన భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. గురువారం పంట పొలంలో దమ్ము చేసిన తర్వాత పార పనిచేస్తుండగా ఫిట్స్ రావడంతో మృత్యువాత పడ్డాడు. మృతుడు అప్పలరాజు ఫిట్స్‌తో అస్వస్థతకు గురైన సమయంలో ఎవరూ అందుబాటులో లేకపోవడంతో. మృత్యువాత పడ్డాడు. అప్పటివరకు అక్కడే ఉన్న తల్లిదండ్రులు భోజనం చేసేందుకు వెళ్లే సమయంలో ఫిట్స్ రావడంతో సాయం చేసేవారు లేకుండా పోయారని అంటున్నారు. మృతుడు. అప్పలరాజుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఇంటి పోషణాధారం హఠాన్మరణంతో ఆ కౌలురైతు కుటుంబం అనాథగా మారిందని గ్రామస్తులు అంటున్నారు.

అప్పలరాజు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

నేరాలు ఘోరాలు

పురుగుల మందు తాగి

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆనందపురం : మండలంలోని చందక పంచాయతీ జగన్నాథపురం గ్రామానికి పాండ్రంగి లావణ్య (22) అనే వివాహిత గురువారం పురుగులు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఆనందపురం పోలీసులతోపాటు స్థానికులు చెప్పిన వివరాల మేరకు జగన్నాథపురం గ్రామానికి చెందిన పాండ్రంగి ప్రసాద్‌తో ముడుదాం గ్రామానికి చెందిన లావణ్యకు మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. కొద్దిరోజులుగా అత్తింటి వేధింపులు ఎక్కువ కావడంతో మనస్థాపానికి గురైన లావణ్య, గతనెల 30న .ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో గడ్డి మందు తాగింది. చాలా సేపటి తర్వాత విషయాన్ని కుటుంబసభ్యులకు చెప్పడంతో వారు వెంటనే స్పందించిన నగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి వైద్యానికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ, ఆరోగ్యం విషమించడంతో లావణ్య మృత్యువాత పడిందని తెలిపారు. అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి కెజిహెచ్‌కు తరలించారు.

మృతురాలు లావణ్య

సాగర్ పబ్లిక్ స్కూల్ అధినేత ఇంట్లో చోరీ

- 40 తులాలు బంగారం,

రూ. రెండు లక్షల నగదు అపహరణ

ప్రజాశక్తి -ములగాడ : సాగర్ పబ్లిక్ స్కూల్ అధినేత ఇంట్లో చోరీ జరిగింది. 40 తులాలు బంగారం, రూ. రెండు లక్షల నగదు అపహరణకు గురైంది. బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివి.

జివిఎంసి 61వ వార్డు ప్రకాష్‌నగర్ జనతా కాలనీలో నివాసం ఉంటున్న సాగర్ పబ్లిక్ స్కూల్ అధినేత రమేష్ బుధవారం తన నివాసంలో క్రింద ఇంటికి తాళం వేసి మేడపైన పడుకున్నారు. గురువారం తెల్లవారుజామున నిద్ర లేచి కిందకు వచ్చేసరికి తలుపులన్నీ తెరిచి ఉండడంతో లోపలకు వెళ్లి చూడగా వస్తువులన్నీ చిందరవందరగా పడిఉన్నాయి. బీరువాను పరిశీలించగా, అందులోని 40 తులాల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షలు నగదు కనబడకపోవడంతో వెంటనే మల్కాపురం పోలీసులకు సమాచారాన్ని అందజేశారు. సంఘటనాస్థలికి చేరుకున్న మల్కాపురం క్రైమ్ పోలీసులు, క్లూస్‌టీం వచ్చి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మిందిలో బంగారు ఆభరణాల అపహరణ

ప్రజాశక్తి -గాజువాక : మింది గ్రామంలో తాళాలు వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగి, బంగారు, వెండి ఆభరణాలను దొంగలు దోచుకుపోయారు. గురువారం వెలుగులోకి వచ్చిన ఘటనకు సంబంధించి గాజువాక క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాలివి.

మింది గ్రామానికి చెందిన ఈటి వెంకటరావు గతనెల 27న విజయవాడలో ఉంటున్న తన కుమారుడి వద్దకు వెళ్లాడు. ప్రతిరోజూ ఇంటిపనిమనిషి వచ్చి, బయట వాకిలి శుభ్రం చేసి వెళ్లిపోయేది ఎప్పటిలాగానే గురువారం ఉదయం వాకిలి శుభ్రం చేసేందుకు వచ్చిన పనిమనిషి ఇంటి తాళం పగిలి ఉండడాన్ని గమనించింది. దీంతో దగ్గర్లో ఉన్న ఇంటి యజమాని కుమార్తెకు సమాచారమిచ్చింది. దీనిపై వెంకటరావు కుమార్తె సరిత, అక్కడికి చేరుకుని, తర్వాత గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అందిన ఫిర్యాదు మేరకు గాజువాక క్రైం పోలీసులు ఘటనా స్థలం చేరుకొని పరిశీలించారు. బాధితులు చెప్పిన వివరాల మేరకు రెండున్నర తులాలు బంగారం, 20 తులాలు వెండి చోరీ జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించారు. క్లూస్ టీమ్ సంఘటనాస్థలికి చేరుకుని ఆధారాలను సేకరించింది. గాజువాక డిసిపి వెంకటరత్నం, ఎసిపి శ్యామలరావు, సిఐ కె.శ్రీనివాసరావు, ఎస్ఐ మన్మథుడు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఎయు అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి

• లోక్‌సభలో ప్రస్తావించిన విశాఖ ఎంపీ శ్రీభరత్

లోక్‌సభలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

ప్రజాశక్తి -మధురవాడ : విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం అభివృద్ధికి నిర్దేశించిన నిధులను తక్షణం విడుదల చేయాలని విశాఖ ఎంపీ శ్రీభరత్ లోక్‌సభ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మొదటి దశలో కేంద్రం నుంచి రావాల్సిన రూ.150 కోట్లు ఇంకా పెండింగ్‌లో ఉండగా, రెండవ విడతలో అదనంగా రూ.400 కోట్లు కావాలని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని, ఆ నిధులను త్వరితగతిన విడుదల చేయాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం కింద రాష్ట్రంలోని కేంద్ర విశ్వవిద్యాలయాలకు ప్రత్యేక నిధుల అవసరాన్ని ప్రస్తావించారు. ప్రాంతీయ, గిరిజన విద్యలో కీలకపాత్ర పోషించబోతున్న కేంద్ర విశ్వవిద్యాలయం, కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయాలు నిర్దేశిత లక్ష్యాలను నెరవేర్చడానికి కేంద్రం ప్రత్యేకదృష్టి పెట్టాలని కోరారు. ప్రస్తుతం కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం తగిన సౌకర్యాలు లేకుండానే నిర్వహిస్తున్నారన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం ప్రతిపాదించిన రెల్లి వద్ద ఏర్పాటుచేస్తే విశాఖ నగరానికి చేరువలో ఉండి విద్యార్థుల ఇంటర్న్‌షిప్, ఫ్యాకల్టీ నియామకానికి మెరుగైన అవకాశాలు ఉండేవన్నారు. విద్యా బడ్జెట్ కేటాయింపులను పెంచిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర విద్యాలయాల బడ్జెట్ 11.22శాతం పెరగడం ద్వారా విద్యానాణ్యత, మౌలిక సదుపాయాలను మెరుగుపడతాయన్నారు. కేంద్ర విశ్వవిద్యాలయాల బడ్జెట్ 38.16శాతం పెరిగినప్పటికీ, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో గిరిజన విశ్వవిద్యాలయాల కేటాయింపులు కేంద్ర విశ్వవిద్యాలయాల పరిధిలోకి వస్తాయో, లేక విడిగా ఉంటాయో నిర్ధారించుకోవాల్సి ఉందన్నారు.

డయేరియా నిర్మూలనపై అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి - ఆనందపురం: మండలంలోని గంభీరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం హ్యాండ్‌వాష్, డయేరియా నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా నీరు, పారిశుద్ధ్య విభాగం, జలజీవన్ మిషన్ జిల్లా సమన్వయకర్త ఆనంద్ పాఠశాలను సందర్శించి,. పాఠశాల బోర్ వాటర్‌ను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. హ్యాండ్‌వాష్ ఎలా చేసుకోవాలి? డయేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు స్థానిక వైద్య సిబ్బంది వివరించారు. అనంతరం జరిగిన ర్యాలీలో జలజీవన్ మిషన్ జిల్లా సమన్వయకర్త ఆనంద్, హెచ్ఎం యువివి ప్రసాద్, ఉపాధ్యాయులు రామకృష్ణ, వరలక్ష్మి, సి హెచ్ఓ కల్పన, గంగ,సచివాలయ ఇంజనీర్ హర్షవర్ధన్ పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన జియ్యాని

మాజీ సిఎంతో భేటీ అయిన డిప్యూటీ మేయర్ శ్రీధర్

ప్రజాశక్తి- వేపగుంట : మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను విశాఖ నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని మాజీ సిఎం జగన్ నివాసంలో కలిసి, పలు విషయాలపై మాట్లాడినట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ఉమ్మడి విశాఖ ఎమ్మెల్సీ స్థానాన్ని నిలబెట్టుకునే చర్యల్లో భాగంగా పలువురు కార్పొరేటర్లు, ఇతర స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు వైసిపి కేంద్ర కార్యాలయం నుంచి పిలుపువచ్చింది. అంతేకాక ఇటీవల విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లో పలువురు వైసిపి కార్పొరేటర్లు పార్టీ మారిన నేపథ్యంలో ఆయా విషయాలు జగన్‌తో భేటీలో ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది.

మాజీ సిఎం జగన్‌ను కలిసిన కార్పొరేటర్ ప్రియాంక

భీమునిపట్నం : మాజీ సిఎం జగన్ మోహన్‌రెడ్డితో జివిఎంసి ఆరోవార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి లక్ష్మీప్రియాంక గురువారం తాడేపల్లిలోని జగన్ క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలో జరిగిన అభివృద్ధిపై కార్పొరేటర్ ప్రియాంక వివరించారు.

అనాథాశ్రమానికి నిత్యావసరాల వితరణ

నిత్యవసరాలను అందజేస్తున్న శ్రీను, లలిత

ప్రజాశక్తి-ఆనందపురం : గుడిలోవలోని అనాథాశ్రమానికి మండలంలోని పాలవలస పంచాయతీ వైసిపి నేత గురజాన శ్రీను, లలిత దంపతులు గురువారం నిత్యవసర సరుకులు వితరణగా అందజేశారు. అనాథాశ్రమంలో పిల్లలకు తమవంతు బాధ్యతగా వీటిని అందజేశామన్నారు కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్ రౌతు శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు విశాఖ క్రీడాకారులు

రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వెళుతున్న తైక్వాండో క్రీడాకారులు

ప్రజాశక్తి -మధురవాడ : అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, క్యాడెట్ పోటీల్లో విశాఖపట్నం జిల్లా తైక్వాండో జట్టు పాల్గొంటుందని తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి అచ్యుతరెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం అచ్చింనాయుడు తెలిపారు. సబ్ జూనియర్ విభాగంలో హర్షవర్ధన్, సుధీర్, గౌతమ్‌సాయి, దీపక్, మేఘా ధనీష్, శుభం మహరాణా, గుణ కీర్తి, గాయత్రి, ఆకాన్యా మాలిక్, కేడెట్ విభాగంలో దుర్గాసాయి శ్రీనివాస్, జస్వంత్, విశాల్, శ్రీకర రోహిత్, జస్వంత్ సాయిసూర్య, ధనలక్ష్మి, బాషిత, నిత్య, జ్ఞాన సిరి పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొనే విశాఖ జిల్లా జట్టు కోచ్‌గా సుకుమార్ సంపత్, టీమ్ మేనేజర్‌గా పిల్లా సురేష్ వ్యవహరిస్తారని అసోసియేషన్ జిల్లాకార్యదర్శి ఎం అచ్చింనాయుడు తెలిపారు.కార్యక్రమంలో పైడిమాంబ తైక్వాండో క్లబ్ కోచ్ కె.శంకర్, లయన్ తైక్వాండో క్లబ్ కోచ్ రమేష్ ముండా, యూత్ తైక్వాండో క్లబ్ కోచ్ మకాన సురేష్, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొని, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేవారికి అభినందనలు తెలిపారు.

జర్నలిస్టుల ఇళ్ల సమస్యను తక్షణమే పరిష్కరించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించి, వారికి తగు ప్రయోజనాలను కల్పించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరనున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు గంట్ల శ్రీనుబాబు తెలిపారు. గురువారం విశాఖ పౌరగ్రంథాలయంలో ఎపి బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అర్బన్ యూనిట్ సమావేశంలో మాట్లాడుతూ, జర్నలిస్టులకు ఇళ్ల మంజూరు సమస్య ఎప్పటికీ పరిష్కారం కావడం లేదన్నారు. 2014-19 మధ్య జర్నలిస్టులకు టిడ్కో ఇళ్ల కేటాయించేందుకు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించిందన్నారు. తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం అర్హులైన జర్నలిస్టులకు మూడుసెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలను కేటాయించేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సేకరించిందన్నారు. దరఖాస్తులు, ప్రతిపాదనలతోనే కాలం తీరిపోతోందని, జర్నలిస్టుల ఇళ్ల కేటాయింపులు సాకారం కావడం లేదన్నారు. దీనిపై త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లను కలిసి విన్నవించనున్నట్లు తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులకు ఇళ్లస్థలాల కేటాయింపునకు ఒకే పాలసీని అమలు చేసే యోచనలో ప్రభుత్వం ఉందని ప్రభుత్వ పెద్దలు చెబుతున్న నేపథ్యంలో దాన్ని వీలైనంత త్వరలో కార్యరూపంలో పెట్టాలనికోరనున్నట్లు తెలిపారు. అలాగే అన్ని కమిటీల్లోనూ జర్నలిస్ట్ సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరనున్నట్లు తెలిపారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ అర్బన్ యూనిట్, అధ్యక్ష, కార్యదర్శులు పి.నారాయణ్, జి.శ్రీనివాసరావు, బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ విశాఖ యూనిట్ అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, కార్యదర్శి మదన్ ప్రతినిధులు పి.నర్సింగరావు, నాయుడు, కె.బాబూరావు, మళ్ల దేవత్రినాథ్, నాయుడు, ఎ.సురేష్, ఎ.శేషు, జిఆర్ ఎస్ రమేష్, ఎన్.నెలరాజు, శివ దిలీప్ పాల్గొన్నారు

కంటి శుక్లాలను నిర్లక్ష్యం చేస్తే అంధత్వం

డాక్టర్ శిల్ప తరిణి

ప్రజాశక్తి- అరిలోవ : కంటి శుక్లాలు అశ్రద్ధ చేస్తే అంధత్వం వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయని ఎల్‌వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ కంటి వైద్యనిపుణురాలు డాక్టర్ శిల్ప తరిణి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అంధత్వానికి కంటిశుక్లం ఒక ప్రధాన కారణమని, శస్త్రచికిత్స ద్వారా కంటిశుక్లం ద్వారా వచ్చే అంధత్వాన్ని నివారించవచ్చునని తెలిపారు. వయసుతోపాటు, మధుమేహం, మూత్రపిండాల వ్యాధి, గ్లాకోమా, కంటి గాయాలు, ఇన్ఫెక్షన్లు, కంటి లోపల మంట, ధూమపానం వంటి కారణాలతో కంటిలో శుక్లాలు వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. అంతేకాక జన్యుపరమైన కారణాలు, జీవక్రియ లోపాలు, ఇన్ఫెక్షన్లు లేదా గాయం వలన కూడ శిశువు లేదా చిన్న పిల్లలలో కంటిశుక్లం రావచ్చునని తెలిపారు. కంటిలో తెల్లని మచ్చ కనిపించటం, మెల్లకన్ను, కనుబొమ్మలు వణకటం వంటివి కంటి శుక్లాల లక్షణాలన్నారు. వైద్య పర్యవేక్షణ లేకుండా మందులు వాడటం, స్టెరాయిడ్స్ వాడకం వలన కూడా కంటి శుక్లాలు వచ్చే అవకాశం ఉందన్నారు. వైద్యులను సంప్రదించకుండా మందులు వాడడం వల్లకూ కంటిలో ఒత్తిడి, కంటిశుక్లం ఏర్పడటం వంటి తీవ్రమైన దుష్ప్రభావాలకు ఏర్పడవచ్చన్నారు. నేత్ర వైద్యులు సూచించిన కంటి మందులను మాత్రమే ఉపయోగించాలని సూచించారు.

రిటైర్డ్ ఎస్ఐకి ఘన సత్కారం

ఎఎస్ఐ సత్యనారాయణను సత్కరిస్తున్న సిపి

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం ఎఎస్ఐగా విధులు నిర్వహించి, ఉద్యోగ విరమణ చేసిన ఆర్.సత్యనారాయణ దంపతులను నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చీ ఘనంగా సత్కరించారు. బిపి కల్లాలులోని ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పోలీసుశాఖలో ఒత్తిళ్ల మధ్య విధులను ఎంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్న ఉద్యోగుల సేవలను ప్రశంసించారు. ఉద్యోగ విరమణ చేసిన తనను అభినందించేందుకు వచ్చిన సిపి, ఇతర పోలీసు అధికారులకు సత్యనారాయణ ధన్యవాదాలు తెలిపాడు.

సిఐ తిరుపతిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎసిపి బి. సునీల్, ఎస్ఐల్లు గంట్యాడ సంతోష్, పందిరి శివ, ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు, బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి వెన్ని శ్రీనివాసరావు, చందక పాండురంగ, వైస్ ఎంపిపి పాండ్రంకి శ్రీను, బంక శ్రీను, మీసాల సత్యనారాయణ, కోరాడ ముసలి నాయుడు, రౌతు శ్రీను పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను సిపి ఆకస్మిక తనిఖీ

ఆనందపురం పోలీస్ స్టేషనును సిపి బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ ఆనుకొని ఉన్న ప్రాంతాలను వ్యర్థాలతో నింపకుండా, శుభ్రం చేయించి, మొక్కలు నాటాలని ఆదేశించారు, స్టేషనుకు ఫిర్యాదులకు వచ్చే ఫిర్యాదుదారులతో స్పందిస్తున్న తీరు తెలుసుకొన్నారు.నేరనియంత్రణ, విచారణలో సిసి టివి కెమెరాలను మరిన్ని వినియోగించాలని సూచించారు. రౌడీషీటర్లు, గంజాయి, డ్రగ్స్ అక్రమరవాణా, ఇతర నేరాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేశారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న సిపి

దేవాదాయ భూములను పరిరక్షించాలి

- ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న సర్వే నెంబర్ 60లో సుమారు రూ.1100 కోట్లు విలువ చేసే 29.71 ఎకరాల సీతారామచంద్రస్వామి దేవస్థానం (అంబికాబాగ్) భూములను పరిరక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో గురువారం భూముల ఆక్రమణపై గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ భూములకు సంబంధించిన వీలునామా, కోర్టు జడ్జిమెంట్, ప్రభుత్వ గెజిట్‌ను విలేకరులకు చూపించారు. అనంతరం వారు మాట్లాడుతూ పై ఆధారాలను బట్టి ఈ భూములు శ్రీసీతారామచంద్ర మూర్తి దేవస్థానానికి చెందినవిగానే వున్నాయని పేర్కొన్నారు. ఆర్డీఒ కోర్టు జడ్జిమెంట్ కూడా వీటిని ధ్రువీకరించిందన్నారు. అయితే కొణతాల రజిని, కొంత మంది కలిసి ఈ భూములను కాజేయాలని కుట్రపూరితంగా కొన్ని తప్పుడు పత్రాలను నోటరీ ద్వారా రాయించుకొని తమ భూములుగా హైకోర్టులో స్టేటస్‌కో ఇచ్చింది అనడం సరైనది కాదన్నారు. ఆ భూముల్లోకి అక్రమంగా ప్రవేశించే ప్రయత్నాలను సిపిఎం ఖండిస్తుందన్నారు. అలాంటి వారిపై పోలీసు కేసులు నమోదు చేసి అరెస్టులు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఎంపీ సిఎం రమేష్ ఎందుకు ఇంత ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం భూ కబ్జాలపై, అవినీతిపై అసెంబ్లీలో పెద్ద ఎత్తున శ్వేత పత్రాలు విడుదల చేసి, వాటిపై చర్చ జరుగుతున్న సమయంలో, అసెంబ్లీ సమావేశాలు ముగిసిన మరుక్షణమే కోట్లాది రూపాయలు విలువైన భూములపై అధికార పార్టీ అండదండలతో ఈ ఆక్రమణకు పాల్పడుతున్నట్లు తెలుస్తోందన్నారు. 2007లో భూ పోరాటంలో భాగంగా సిపిఎం జెండాలను పాతి ఈ భూములను పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలని కోరిందని, నాడు సిపిఎం నాయకులపై కేసులు పెట్టడంతో పాటు ఇవి దేవాదాయ భూములను కాబట్టి ఎవరికీ చెందవని ప్రభుత్వం తెలిపిందని గుర్తు చేశారు. ఇప్పుడు ప్రైవేటు వ్యక్తులొచ్చి ప్రొక్లెయినర్‌తో భూమిని చదును చేస్తుంటే అధికారులు, ప్రభుత్వం ఏమిచేస్తుందని ప్రశ్నించారు. ఈ భూములను ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, అల్లు రాజు, మండల నాయకులు కాళ్ళ తెల్లయ్యబాబు, నాగిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూముల ఆక్రమణపై గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సిపిఎం నేతలు

ఎమ్మెల్యే కొణతాలకు వినతిపత్రం ఇస్తున్న ఆశా కార్యకర్తలు

ఆశా వర్కర్ల సమస్యలపై వినతి

ప్రజాశక్తి- అనకాపల్లి

గత ప్రభుత్వ కాలంలో ఆశా కార్యకర్తల హామీలు నెరవేర్చేందుకు హామీ ఇచ్చారని, ప్రభుత్వం ఇచ్చిన మినిట్స్‌లో ఉన్న అంశాలను పరిష్కారం చేయాలని కోరుతూ గురువారం ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆశ వర్కర్లపై పని ఒత్తిడి తగ్గించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆశా వర్కర్ల అందరికీ అమలు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఆశల రిటైర్మెంట్ వయసుని 62 సంవత్సరాలకు పెంచాలని, రిటైర్ అయిన ఆశా కార్యకర్తలకు గ్రాట్యుటీ అమలు చేయాలని, ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్తల పోస్టులు భర్తీ చేయాలని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే కొణతాల ప్రభుత్వంతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు కె.శాంతి, కోశాధికారి సూర్యకుమారి, సిహెచ్.వెంకటలక్ష్మి, ఆడారి అన్నపూర్ణ, నాగమణి, విజయ, భవాని తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే 'తల్లికి వందనం' అమలు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : నూతనంగా ఏర్పాటైన టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు తక్షణమే తల్లికి వందనం పథకాన్ని అమలు చేసి పేద విద్యార్థులను ఆదుకోవాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్ల నాగభూషణం గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఇంటిలో ఎంత మంది విద్యార్థులు ఉంటే వారందరికీ కూడా రూ.15000 చొప్పున ఇచ్చి ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టుబడాలని హితవుపలికారు. 2024వ సంవత్సరానికి తల్లికి వందనం హామీ అమలు చేయలేమని ప్రభుత్వం ప్రకటించిందని, దీని వలన రాష్ట్రంలోని నిరుపేద విద్యార్థుల తల్లి తండ్రులు చాలా ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. తల్లికి వందనం వస్తుందని అప్పులు చేసి ఫీజులు కట్టారని, ఇప్పుడు ఆ డబ్బులు రాకపోతే వారు తల్లిదండ్రులు అప్పలపాలవుతారని, మధ్యలోనే చదువులు మాన్పించే పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యా శాఖమంత్రి తల్లికి వందనం హామీని తక్షణమే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

వైఎస్.జగన్‌తో వైపిపి అనకాపల్లి నియోజకవర్గం నేతలు

మాజీ సిఎం జగన్‌ను కలిసిన నియోజకవర్గం నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో గురువారం వైసిపి అనకాపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ మలసాల భరత్ కుమార్ నేతృత్వంలో పలువురు నాయకులు కలిశారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి తీసుకోవలసిన చర్యలపై జగన్ పలు సూచనలు చేశారు. నియోజకవర్గంలో పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. జగన్‌ను కలిసిన వారిలో జీవీఎంసి కార్పొరేటర్లు మందపాటి సునీత జానకిరామరాజు, పీలా సౌజన్య రాంబాబు, జాజుల ప్రసన్న లక్ష్మి రమేష్, కశింకోట మండల నాయకులు మలసాల కిషోర్, కలగా గున్నయ్య నాయుడు, భరత్ కుమార్ సోదరుడు మలసాల కుమార్ రాజా తదితరులున్నారు.

రాంకీ యాజమాన్యం మరోసారి బరితెగింపు

రసాయనక వ్యర్థ జలాలు కాలువలోకి విడుదల

రాంకీ విడుదల చేసిన వ్యర్థ రసాయన జలాలను చూపుతున్న నేతలు

ప్రజాశక్తి-పరవాడ

మండలంలోని జెఎన్ ఫార్మాసిటీలో రాంకీ యాజమాన్యం మరోసారి బరితెగింపు చర్యలకు పాల్పడింది. తాడి గ్రామానికి సమీపంలో రాంకీ పంపు హౌస్ పక్కన ఫార్మా పరిశ్రమలకు చెందిన వ్యర్థ రసాయనిక జలాలను ఏలేరు కాలువ వైపు విడుదల చేసింది. ఇది గమనించిన తాడి గ్రామస్తులు రాంకీ యాజమాన్యం చర్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, తాడి గ్రామ యువజన సంఘం సభ్యులతో కలిసి గురువారం వ్యర్థ జలాలు ప్రవహిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం గనిశెట్టి మాట్లాడుతూ ఫార్మా వ్యర్థ రసాయనాలు ఇప్పటికే పరవాడ పెద్ద చెరువు, ఊర చెరువు, మొల్లేడుగెడ్డ, తాడి సమీపంలో కాలువల్లోకి విడుదల చేయడంతో తీవ్ర కాలుష్యంతో ప్రజల అల్లాడుతున్నారని తెలిపారు. ఇప్పుడు ఏలేరు కాలువకి పది మీటర్ల సమీపంలో రాంకీ యాజమాన్యం విడుదల చేసిన వ్యర్థ రసాయన జలాలు ప్రవహిస్తున్నాయని, ఈ జలాలు ఏలేరు కాలువలోకి వెళ్లే అవకావం ఉందని పేర్కొన్నారు. విశాఖపట్నం ప్రజల తాగునీటి కోసం ఏలేరు కాలువ ద్వారా వెళ్తున్న నీటిలో ఈ వ్యర్థ రసాయన జలాలు వెళ్తే ఎంత ప్రమాదమో అర్థం చేసుకోవాలన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, రాష్ట్ర పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గల్లా భార్గవ్, సాలాపు భాస్కర్, కోమటి గురుమూర్తి, శ్రీను, బాలాజీ పాల్గొన్నారు.

సాగు భూమిలో హెచ్చరిక బోర్డులు తొలగించాలని వినతి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని కొన్నెంపూడిలో ఇటీవల రెవిన్యూ అధికారులు ప్రభుత్వ భూమిగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారని, ఆ భూమి తన సాగులోనే ఉందని, హెచ్చరిక బోర్డులు తొలగించాలని డి-పట్టా పొందిన కడియాల సాంబశివరావు గురువారం మండల రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. 1990 సంవత్సరంలో కొన్నెంపూడి సర్వేనెంబర్ 5లో తనకి రెవెన్యూ అధికారులు బి పట్టా మంజూరు చేశారని, సదరు భూమిని తానే సాగు చేసుకుంటూ ఇటీవలే ఉపాధి నిమిత్తం సదరు భూమిని కౌలుకి ఇచ్చి ఇతర ప్రాంతానికి వెళ్లానని సాంబశివరావు తెలిపారు. సదరు భూమికి సంబంధించి ప్రతి ఏడాది కవులను కూడా రైతుల నుండి పొందుతున్నానని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన కొంతమంది సదరు భూమిపై వివాదాలు సృష్టిస్తున్నట్లు తెలిపారు. తన సాగు భూమిలో అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను తొలగించాలని కోరారు.

వినతిపత్రం ఇస్తున్న కడియాల సాంబశివరావు

హత్యలు, అత్యాచారాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

మహిళలు విద్యార్థినులపై అత్యాచారాలు, హత్యలకు పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పిడిఎస్ఓ రాష్ట్ర కోశాధికారి ఎల్.భాను డిమాండ్ చేశారు. స్థానిక గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో గురువారం పిడిఎస్ఓ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు నెలల నుండి 60 ఏళ్ల వృద్ధుల వరకు అనేక రూపాల్లో అత్యంత కిరాంతకంగా లైంగిక దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. అనకాపల్లి జిల్లాలో ప్రేమించలేదని 13 ఏళ్ల బాలికపై అత్యంత కిరాతకంగా కొడవలతో గొంతు కోసి చంపిన సంఘటన, అమ్మాయిపై బాత్రూంలో అత్యాచారం, బ్రాండిక్స్‌లో కంపెనీలో లైంగిక వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య వంటి సంఘటనలు భయాందోళనలు రేపుతున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి తప్పుడు భావజాలానికి పోర్న్ సైట్లు, మద్యం, మత్తు పదార్థాలు కారణమని నిందితులు చెప్పినా సరే వాటిపై ప్రభుత్వాలు ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రశ్నించారు. పిడిఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ .భాస్కర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యార్థులకు తక్షణమే పాఠ్య పుస్తకాలు ఉచితంగా అందించాలని, మధ్యాహ్నం భోజన పథకాన్ని ప్రారంభించాలని, గెస్ట్ ఫ్యాకల్టీలను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో పిడిఎస్ఓ నాయకులు ఎం.గరగనాయుడు, ఏ.సాయి, ఎం.కుమార్, గణేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలకు సంబంధించి పాఠశాల వారీగా నోటిఫికేషన్ విడుదల చేసినట్ల మండల విద్యాశాఖ అధికారి బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు గురువారం తెలిపారు. మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు సంబంధించి 62 పాఠశాలల్లో నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు.

సబ్బవరం : మండలంలోని 52 పాఠశాలల్లో ఈ నెల 8న స్కూల్ యాజమాన్యాల కమిటీ ఎన్నిక నిర్వహించడం జరుగుతుందని ఎంఈఓ -1 ఎస్.లక్ష్మణరావు గురువారం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు, సంరక్షకులకు ఓటు హక్కు ఉంటుందన్నారు.

ఘనంగా బుద్ధ శివాజీ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి

కేంద్ర గౌరీ సేవా సంఘం, ప్రేమ సమాజం అధ్యక్షులు బుద్ధ శివాజీ జన్మదిన వేడుకలు అనకాపల్లి గవరపాలెం పార్క్ సెంటర్ వద్ద సోదర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పెద్దలందరూ బుద్ధ శివాజీ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్లు మల్ల సాంబశివరావు, కొణతాల జగన్, టిడిపి బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మల్ల సురేంద్ర, కొణతాల పూర్ణచంద్రరావు, కాంద్రేగుల దాసు, పెంటకోట సుబ్రహ్మణ్యం, కర్రి సన్యాస నాయుడు, దాడి వాసు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రమేష్‌బాబు దంపతులను సత్కరిస్తున్న పోలీసులు

రమేష్ బాబుకు ఘనంగా వీడ్కోలు సన్మానం

ప్రజాశక్తి- కశింకోట : కసింకోట పోలీస్ స్టేషన్లో సబ్ ఇన్‌స్పెక్టర్ పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన కె.రమేష్‌బాబును బుధవారం రాత్రి కోలాట కళ్యాణ మండపంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కశింకోట సీఐ వినోదబాబు మాట్లాడుతూ ఎస్సై రమేష్ బాబు సమర్థవంతంగా తన విధులను నిర్వర్తించారని కొనియాడారు. అనంతరం జ్ఞాపక అందజేసి సాలువ కప్పి పూలదండలతో రమేష్ బాబు దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఎస్సై జె నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా దండు ముత్యాలమ్మ పండగ

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామంలో గురువారం శ్రీదండు ముత్యాల అమ్మవారి పండగ ఆ గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. బుధవారము రాత్రి తోలేలతో ఈ పండగ ప్రారంభమైంది. ఉదయం నుంచి అమ్మవారి ఆలయం వద్ద భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి మొక్కులు తీసుకున్నారు. మధ్యాహ్నం మందు గుండు, డప్పులు వాయిద్యాలు మహిళల చిరతలు, తప్పిడి గుళ్ళతో అమ్మవారి పండగ జరిపారు. రాత్రి పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దాడి ఎరుకునాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్, తనకల్లు పట్టాలు, పెంటకోట గణేశ్వరరావు, రాజి శ్రీనివాసరావు, రాజి మోతి నాయుడు, పాల సొసైటీ అధ్యక్షులు కుమార వెంకటరమణ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్తు సమావేశం

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరుగుతుందని ఇంచార్జ్ ఎంపీడీవో ఎస్.అప్పలరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన మండల పరిషత్ కార్యాలయంలో నూతన ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ఈ సమావేశం ప్రారంభంకానుందని, జడ్పీటీసీతో పాటు మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు. వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌గా జూరెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి విద్యుత్ సెక్షన్ ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్‌గా జూరెడ్డి ముత్యాల నాయుడు సెక్షన్ ఆఫీసులో ఏఈ కె. శంకర్రావు ఆధ్వర్యంలో గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ 2003లో దేవరాపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభించారని, నాటి నుంచి ఈ పోస్టు లేకపోవడం వల్ల వినియోగదారులు చాలా ఇబ్బంది పడేవారని తెలిపారు. వినియోగదారుల బిల్లు అవకతవకలు సరి చేయడానికి చాలా ఇబ్బంది పడేవారని, ఈ బిల్లులు సరి చేయడానికి గతంలో అనకాపల్లి ఆఫీస్‌కు పంపించవలసి వచ్చేదని పేర్కొన్నారు. తొలిసారిగా సీనియర్ అసిస్టెంట్‌గా ముత్యాల నాయుడును నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బాధ్యతలు చేపట్టిన ముత్యాల నాయుడుకు జేఈ ఆర్ సన్యాసినాయుడు, లైన్ మాన్ బొడ్డు రాము, కంప్యూటర్ ఆపరేటర్ పాసల వెంకట గణేష్, సిబ్బంది అప్పలరాజు, జాగరపు సతీష్ శుభాకాంక్షలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న జూరెడ్డి ముత్యాలనాయుడు

డ్వాక్రా రుణాల్లో అవినీతికి పాల్పడిన

బ్యాంకులు, డిఆర్‌డిఎ అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి-అనకాపల్లి

డ్వాక్రా రుణాల అవినీతి పాల్పడిన బ్యాంకులు, డిఆర్డిఏ అధికారులపై చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం చేయాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం డ్వాక్రా మహిళలతో అనకాపల్లి జిల్లా కార్యదర్శి డిడి వరలక్ష్మి అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న రమాదేవి మాట్లాడుతూ సత్యనారాయణపురం గ్రామంలో డ్వాక్రా సంఘాలకి సంబంధిత సిఎ మంగతాయారు నకిలీ గ్రూపుల ఏర్పాటు చేసి చేసి గ్రూప్ సభ్యుల చేత రూ.10లక్షలు నుండి రూ.15 లక్షల వరకూ డ్వాక్రా రుణాలు అక్రమంగా మంజూరు చేసి కాజేశారని తెలిపారు. అసలు ఎకౌంటు లేని వ్యక్తికి బ్యాంకు రుణాలు మంజూరు చేసి బినామీ గ్రూప్ పేర్లతో శ్రీనిధి, ముద్ర వంటి లోన్లు పెట్టి వాళ్ళ ప్రమేయం లేకుండా డబ్బులు కాజేసి ఆరు నెలలుకి పైగా అవుతున్నా డిఆర్డిఏ అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఈ సమస్యపై వెలుగు అధికారులకు, పోలీసులకు, జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలు ద్వారా తెలిసినా ఇంతవరకూ సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని నిందితులను విచారణ జరిపి దోషులను అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. నకిలీ గ్రూపులకు పెద్ద మొత్తంలో లోన్లు ఇచ్చిన బ్యాంక్ అధికారులపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం, కోశాధికారి కెవి.సూర్యప్రభ, సహాయ కార్యదర్శి ఆర్.లక్ష్మి, నాయకులు యు.నాగమణి, యు.లోవ, ఎన్.రాణి, దుర్గ, రేవతి, నూకరత్నం, నాగమణి, నిర్మల, ధనలక్ష్మి, నాగరత్నం, వరలక్ష్మి, పెద్ద సంఖ్యలో బాధిత మహిళలు పాల్గొన్నారు.

సదస్సులో పాల్గొన్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, ఐద్వా నాయకులు

మెమో 1214ను రద్దు చేయాలని ఆందోళన

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్

నినాదాలు చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేస్తూ వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన 1214 మెమోను తక్షణం రద్దు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన మండలంలోని తిమ్మరాజుపేట, కొండకర్ల, దోసూరు, అచ్యుతాపురం గ్రామాలలో భవన నిర్మాణ కార్మికులు గురువారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలను ఆపివేస్తూ గత ప్రభుత్వం 1214 మెమోను విడుదల చేసిందని తెలిపారు. దీని వల్ల లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని అనేక సార్లు విన్నవించినా వైసిపి ప్రభుత్వం మొండివైఖరితో పట్టించుకోలేదని విమర్శించారు. నాడు ప్రతిపక్షంలో ఉన్న టిడిపి జనసేన పార్టీలు తాము అధికారంలోకి వస్తే సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చాయని గుర్తు చేశారు. అప్పుడు ఇచ్చిన హామీ మేరకు 1214 మెమో రద్దు చేసి భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో శ్రీను, రాజు, అప్పలనాయుడు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

ఏఐటియుసి ఆధ్వర్యాన

బుచ్చయ్యపేట : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరణ చేయాలని ఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) సంఘం జిల్లా నాయకులు బర్నికాన దేముళ్ల డిమాండ్ చేశారు. బుచ్చయ్యపేట శివారు నేతవానిపాలెంలోని రామాలయం వద్ద శ్రీవంశీకృష్ణ తాపీ మేస్త్రి సంఘం సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ బోర్డును జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసి దాని నుండి రూ.1800 కోట్లను దారిమళ్లించారని తెలిపారు. సమావేశంలో వియ్యపు రాము, జాగరపు అప్పారావు, బి.రాజు, వెంకటేష్, అప్పారావు, సత్యనారాయణ, నర్సింగరావు, పాల్గొన్నారు.

గోతులు పూడ్చుతున్న దృశ్యం

గోతులు పూడ్చివేత

ప్రజాశక్తి -వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది జూనియర్ కాలేజీ వద్ద బంగారు జంక్షన్లో బిఎన్ రోడ్డుపై ఉన్న గుంతలను వడ్డాది తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు దొండా నరేష్ తన సొంత నిధులతో పూడ్చివేత పనులు చేపట్టారు. ఇటీవల కాలంలో కురిసిన వర్షాలకు రోడ్లు బాగా గుంతలు పడే చెరువుగా మారాయి. వాహనాలు ఈ రోడ్డు పైనుండి ప్రయాణించాలంటే నరకయాతనగా ఉండేది. ఈ గుంతలు ఇలానే ఉంటే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని నరేష్ తన సొంత నిధులతో ట్రాక్టర్‌తో మట్టి, కంకర, రాళ్లని తీసుకువచ్చి గుంతలో వేసి జెసిబితో చదును చేయించాడు. దీనిపై వాహనదారులు నరేష్‌కు ధన్యవాదాలు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని గొండుపాలెం విద్యుత్ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం జరుగుతుందని విద్యుత్ వినియోగదారులంతా సహకరించాలని స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్ తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మత్తులు విద్యుత్ తీగలపై వాలుతున్న చెట్లను తొలగించడం తదితర మెయింటినెన్స్ పనులు నిమిత్తం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు వెల్లడించారు. మండలంలోని గుల్లేపల్లి, మల్లంపాలెం, చౌడువాడ, గొండుపాలెం గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని చంద్రశేఖర్ తెలిపారు.

ఎస్‌సి వర్గీకరణపై సుప్రీం తీర్పు పట్ల హర్షం

మంద కృష్ణ మాదిగ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి- సబ్బవరం

ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని ఎమ్మార్పీఎస్ నేతలు గురువారం సంబరాలు జరుపుకున్నారు. ఎంఆర్‌పిఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గొట్టివాడ సామ్రాట్ కుమార్ ఆధ్వర్యంలో సబ్బవరం మండల కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, మంద కృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. బాణాసంచా కాల్చారు. ఈ సందర్భంగా సామ్రాట్ కుమార్ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ గత 30 ఏళ్లుగా చేసిన పోరాటానికి ఈరోజు ఫలితం దక్కిందన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు నియోజకవర్గ నాయకులు ఇండుగు బల్లిగోపి, బొర్రా జయరాజ్, దువ్వుదుర్గాలు, గొట్టివాడ సన్యాసి, కోమ్ముకోటి అప్పారావు, భూపతి అప్పారావు, నీటిపల్లి ముత్యాలరావు, ఈతలపాక పోలయ్య, మారేడుబుడి కోటి, గంట్యాడ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పుపై ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇండుగుబిల్లి దేముడు బాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ తీర్పుతో విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పనకు దోహదం చేస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే వర్గీకరణ అమలు చేయాలని కోరారు.

పురోహిత బ్రాహ్మణ సంఘం అధ్యక్షునిగా పెద్దింటి

ప్రజాశక్తి - యలమంచిలి : పురోహిత బ్రాహ్మణ సమాఖ్య జిల్లా అధ్యక్షులుగా పెద్దింటి సూర్యనారాయణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనకాపల్లి జిల్లా పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ఉత్తరాంధ్ర విభాగం ఆధ్వర్యంలో విశాఖ శిల్పారామంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి సమావేశంలో అనకాపల్లి జిల్లా కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా పురోహిత బ్రాహ్మణుల కోసం ఎల్లవేళలా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

నియామక పత్రం అందుకుంటున్న పెద్దింటి

తల్లిపాలతో బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం

అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మురళీమోహన్

తల్లిపాలతో బిడ్డలకు శ్రేయస్కరమని పలువురు వైద్యాధికారులు తెలిపారు. అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహనా ర్యాలీలు నిర్వహించారు.

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

గొలుగొండ: మండలంలో మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో తల్లిపాలు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కేడీపేట, గొలుగొండ, చీడిగుమ్మల వైద్యాధికారులు హరి ప్రవీణ్, శ్యామ్, ధనుంజయ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. పుట్టిన వెంటనే ఇచ్చే పసుపు రంగులో పాలలో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని పెంచడమే కాకుండా, వారి మెదడు వికసించేందుకు ఎంతగానో తోడ్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా సిహెచ్‌ఓలు, హెల్త్ సూపర్వైజర్లు, హెల్త్‌అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

గొలుగొండ: పుట్టిన బిడ్డకు తల్లిపాలు శ్రేయష్కరమని ఐసిడిఎస్ గొలుగొండ ప్రాజెక్ట్ అధికారిని శ్రీ గౌరీ అన్నారు. గురువారం గొలుగొండలో ఐసిడిఎస్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు అందించాలన్నారు. తల్లిపాలలో పోషక విలువ అధికంగా ఉంటాయని, దీంతో బిడ్డల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు సత్యవతి, వసంత, కార్యకర్తలు మంగతాయి, జ్యోతి, దేవి తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి: తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో తల్లిపాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి కే చంద్రశేఖర్ దేవ్, జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అధికారి నాగమణి మాట్లాడుతూ తల్లిపాల వల్ల బిడ్డల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో గణాంక శాఖ అధికారి ఎస్ రామచంద్రరావు, హెల్త్ ఎడ్యుకేటర్స్ శివరామకృష్ణ, వెంకటలక్ష్మి, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం, నూతనగుండుపాలెం గ్రామాల్లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గురువారం తల్లిపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్ళపాలెం పిహెచ్‌సి వైద్యాధికారి యు.రమేష్ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తల్లి పాలు వెంటనే ఇవ్వాలని, తల్లిపాల వల్ల బిడ్డకు మానసిక శారీర ఎదుగుదల ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారి మనీషా, ఐసిడిఎస్ సూపర్ వైజర్లు సిహెచ్.వంశీ ప్రియా, సుచరిత, వైద్య సిబ్బంది అదిలక్ష్మి, కె.ధనలక్ష్మి, పి.బోరమ్మ, అమ్మాజీ, రామలక్ష్మి, మహిళా పోలీస్ ధనలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు జ్యోతి, కె.అమ్మాజీ పాల్గొన్నారు.

కె.కోటపాడు : తల్లిపాల విశిష్టతపై పలువురు గర్భిణీలకు బాలింతలకు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్వాడి అధికారులు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎల్బి సుశీల, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

సీతమ్మధార : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్.పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో రీజినల్ ట్రైనింగ్ సెంటర్ (అడ) ప్రిన్సిపాల్ డాక్టర్.బి.సుజాత, జిల్లా ప్రోగ్రాం అధికారులతో కలిసి తల్లి పాల వారోత్సవాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డిఎంహెచ్‌ఒ కార్యాలయం నుంచి సత్యం కూడలి మీదుగా మరలా కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఒ డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ, బిడ్డ ఆరోగ్యానికి తల్లి పాలు ఎంతో శ్రేష్టమని, పుట్టిన గంట లోపు బిడ్డకు తల్లిముర్రిపాలు పట్టిస్తే వ్యాధి నిరోధకశక్తి పెంపొందడంతోపాటు అమృతంలా పనిచేస్తున్నారు. బాలింతలు తమ బిడ్డలకు ఆరునెలల వరకు కొనసాగించాలని సూచించారు. ర్యాలీలో డిఐఒ డాక్టర్ డా.ఎస్.జీవనరాణి, డిపిఎంఒ డాక్టర్.బి.ఉమావతి, డిఇఎంఒ బి.నాగేశ్వర రావు, హెచ్ఇఇఒ కె.ధర్మేంద్ర, డిపిహెచ్ఎన్ఒ ఐ.మనోరమ, రవిశంకర్, బేగం, హెల్త్ ఎడ్యుకేటర్, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖపట్నం: గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో పెద జాలారిపేట అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు, యుపిహెచ్‌సి పరిధిలోని అంగన్వాడీ కేంద్రానికి చెందిన 20 మంది బాలింతుల, గర్భిణులకు అవగాహన కల్పించారు. సమావేశంలో పీడియాట్రిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గేష్మాంజలి, యుపిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎంవీవీ మురళీమోహన్ తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు. డాక్టర్ సుచిత్ర, డాక్టర్ చరిష్మ, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ మానస, ఎస్‌కె పెద్ద జాలరిపేట అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ చెల్లయమ్మ పాల్గొన్నారు.

మధురవాడ: జిమ్సర్ ఆస్పత్రి ప్రాంగణంలో స్కూల్ ఆఫ్ నర్సింగ్ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. జిమ్సర్ డీన్ డాక్టర్ ఎస్.పి.రావు పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యత, తల్లీబిడ్డకు కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో జిమ్సర్ మెడికల్ కళాశాల డాక్టర్ విజయలక్ష్మి, గీతం స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. వెంకటేషన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ టి. మాలతి, టి.రత్న, డి.శ్రీవల్లీ, పాల్గొన్నారు. తల్లిపాల ప్రాధాన్యతను తెలిపేలా నర్సింగ్ విద్యార్థులు ప్రదర్శించిన స్కిట్లు అలరించాయి.

గొలుగొండలో ర్యాలీ చేపడుతున్న వైద్య సిబ్బంది

పెందుర్తి : 94వ వార్డు వేపగుంట ముత్యమాంబ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. సిడిపిఒ నీలవేణి తల్లిపాల ప్రయోజనాలను, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మీదేవి అంగన్వాడి టీచర్ రాజేశ్వరి పాల్గొన్నారు

ఆరిలోవ : ఆరిలోవ రెయిన్ బో ఆసుపత్రిలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు రావి శ్రీనివాసరావు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆసుపత్రి యాజమాన్యం, వైద్య బృందం ఆవిష్కరించారు. సమావేశంలో రెయిన్ బో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సిహెచ్ రాగసుధ, డాక్టర్ ఎంవిఆర్ శైలజ, డాక్టర్ నిహారిక అల్లు, డాక్టర్ శ్రీలత పులి, డాక్టర్ ఎస్.నలిని, యూనిట్ హెడ్ పద్మ కుమార్, డాక్టర్ దిలీప్, మనోజ్ రెడ్డి, సత్యసాగర్ పాల్గొన్నారు.

కెజిహెచ్ లో త్వరలో తల్లిపాల బ్యాంకు

విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో త్వరలో తల్లిపాల బ్యాంకును ఏర్పాటు చేయనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద తెలిపారు. గురువారం కెజిహెచ్ పీడియాట్రిక్ డిపార్టుమెంట్‌లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పీడియాట్రిక్ విభాగ అధిపతి డాక్టర్ చక్రవర్తి, ఇన్చార్జి ప్రిన్సిపాల్, పీడియాట్రిక్ సర్జరీ విభాగ అధిపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగ అధిపతి డాక్టర్ కృష్ణవేణి, గైనిక్ ప్రొఫెసర్ డాక్టర్ సౌమిని, పీడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ రత్నకుమారి పాల్గొన్నారు.

ఆర్థోపెడిక్ వైద్య సేవలో నక్కపల్లి సిహెచ్‌సికి

రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం

ప్రజాశక్తి -నక్కపల్లి: ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా ఆర్థోపెడిక్‌లో ఎక్కువ శాతం రోగులకు వైద్య సేవలు అందించడంతో నక్కపల్లి సిహెచ్ సి రాష్ట్రంలో ప్రథమ స్థానం దక్కించుకుంది. స్థానిక ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ డాక్టర్ కె.రవికిరణ్ గత నెల జులై 1వ తేదీ నుండి జులై 15వ తేదీ వరకు 30 మంది రోగులకు ఎముకులు, కీళ్ల నొప్పులకు సంబంధించి శస్త్ర చికిత్సలు చేశారు. దీంతో, రాష్ట్రవ్యాప్తంగా నక్కపల్లి సిహెచ్‌సి ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు ఆసుపత్రి సూపరింటెండెంట్ , వైద్యులు, వైద్య సిబ్బంది ఆర్థోపెడిక్ డాక్టర్ రవి కిరణ్ ను అభినందించారు.

శస్త్ర చికిత్స చేస్తున్న డాక్టర్ రవి కిరణ్

వర్గీకరణలో రెల్లిలకు ప్రాధాన్యత కల్పించాలి

రెల్లి హక్కుల రిజర్వేషన్ రాష్ట్ర అధ్యక్షులు పాపారావు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పోరాటం ఫలించిందని రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు అన్నారు. గురువారం ఆయన చెట్టుపల్లిలో మీడియాతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీల కులాలలో వెనుకబడిన వారికి వర్గీకరణ అవసరమని ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణ మాదిగ అలుపెరగని పోరాటం చేశారన్నారు. ఈ విషయమై సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు.ఎస్సీలో వెనుకబడిన కులాల వారికి ప్రాధాన్యత కల్పిస్తూ విద్యా ఉపాధి ఉద్యోగ రాజకీయ రిజర్వేషన్ రంగాలలో మొదట ప్రాధాన్యత కల్పించే విధంగా వర్గీకరణ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. వర్గీకరణలో రెల్లి కులస్తులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో వెంకటాపురం సబ్ స్టేషన్ పరిధిలోని వెంకటాపురం, కొడవటిపూడి, తిమ్మాపురం, లింగాపురం గ్రామాలలో జంగిల్ క్లియరెన్స్ లో భాగంగా ఈనెల 2న ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా కు అంతరాయం ఏర్పడనుందని మండల విద్యుత్ శాఖ అధికారి మహేష్ తెలిపారు. ఆయా ప్రాంతాల వాసులు సహకరించాల్సిందిగా కోరారు.

నివాళి అర్పిస్తున్న జెవి సత్యనారాయణ

మాకిరెడ్డి దేముడుకు ఘన నివాళి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మండలంలోని గబ్బాడ గ్రామంలో సిపిఐ, రైతు ఉద్యమ నేత కామ్రేడ్ మాకిరెడ్డి దేముడు ప్రథమ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థూపం వద్ద సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ జేవి.సత్యనారాయణమూర్తి, సిపిఐ ప్రజాసంఘాలు నాయకులు నివాళ్లు అర్పించారు.రాష్ట్ర రైతు సంఘం సీనియర్ నాయకులు రావు జగ్గారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెవి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, కామ్రేడ్ దేముడు చివరి క్షణం వరకు ఎర్రజెండా పక్షాన నిలబడి భూ పోరాటాలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, కొయ్యూరు మండల జడ్పిటిసి వారా నూకరాజు, రాష్ట్ర సమితి నాయకులు అచ్యుత్, జిల్లా మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

సీలింగ్ భూముల వివాదంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో కృష్ణదేవపేట రెవెన్యూ పరిధిలో ఉన్న సీలింగ్ భూముల్లో తమకు ప్రభుత్వం మంజూరు చేసిన భూమిలో సాగులోనికి రానివ్వకుండా కొన్ని వర్గాల వారు అడ్డుకుంటున్నారని గురువారం తసిల్దార్ కార్యాలయంలో కృష్ణదేవిపేట ఉపసర్పంచ్ దుంపలపూడి సహదేవుడు ఆధ్వర్యంలో బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఫిర్యాదుర్లంతా విలేకరులతో మాట్లాడుతూ, 1994 సంవత్సరంలో కృష్ణదేవిపేటకు చెందిన 30 మందికి సీలింగ్ భూమిలో 15 ఎకరాల 20 సెంట్లు భూమిని 26 మందికి ప్రభుత్వం డి పట్టాలు మంజూరు చేసిందన్నారు. ఈ భూముల్లో దారుల మీద తాము గురువారం సాగు చేయడానికి పనులు ప్రారంభించగా పోలీసులు బెదిరింపులకు పాల్పడ్డారని బాధితులు ఆరోపించారు. దీనిపై తహసిల్దార్ కార్యాలయానికి వచ్చి న్యాయం చేయాలంటూ డిప్యూటీ తహసిల్దార్ రాజభరత్ కు ఫిర్యాదు చేశామని తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన భూముల తాము సాగు చేసుకోవడం కొంతమంది భూస్వాములుకు ఇష్టం లేదని ఆరోపించారు. పోలీసులు సహాయంతో మమ్మల్ని సాగులోనికి రాకుండా అడ్డుకోవడానికి బెదిరింపులకు పాల్పడ్డారని వారు తెలిపారు. భూములపై తమ హక్కు కోసం నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ కార్యాలయం కూడా ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాధితులు గండేపల్లి సత్యవతి, జిల్లేడుపూడి వరలక్ష్మి, అద్దెపల్లి రాజులమ్మ, మువ్వల నూకాలమ్మ, అయినవిల్లి అప్పలనరస, మాజీ ఎంపీటీసీ వి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ విషయంపై కేడీపేట ఎస్సై ఉపేంద్రను వివరణ కోరగా, గతంలో ఈ భూమిపై వివాదం ఉన్నందున శాంతిభద్రతలకు విఘాతం కలగకూడదనే ఉద్దేశంతో గొడవలు రాకుండా చూసుకోవాలని సూచించానని అన్నారు.

నినాదాలు చేస్తున్న బాధితులు

బ్యాగులు ఇస్తున్న హెచ్ఎం అప్పారావు

స్కూల్ బ్యాగుల అందజేత

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు స్కూల్ బ్యాగులను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అప్పారావు చేతుల మీదుగా బ్యాగులను గురువారం ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రత్యేక ఉపాధ్యాయురాలు షేక్ యాస్మిన్ మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను గుర్తించి, వారికి ప్రత్యేక తర్ఫీదును ఇస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా అవసరమైన పిల్లలకు ఫిజియో థెరపీ సేవలను కూడా అందిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రత్యేక ఉపాధ్యాయులు కోరారు.

పెన్సిల్ ముల్లుపై ఒలింపిక్ చిహ్నం

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ గ్రహీత, సూక్ష్మ కళాకారుడు, డాక్టర్ గట్టెం వెంకటేష్ తన సూక్ష్మ కళతో ఒలింపి క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులకు అభి నందనలు తెలి పాడు. పెన్సిల్ ముళ్ళు పై ఒలింపిక్ క్రీడా చిహ్నంను చెక్కి అద్భుతంగా ఆవిష్కరించాడు. 6 డి పెన్సిల్ ముల్లుపై ఎత్తు 6 ఎం ఎం ,వెడల్పు 12 ఎంఎంలలో ఒలింపిక్ క్రీడా చిహ్నాన్ని 2 గంటల సమయములో చెక్కినట్లు వెంకటేష్ తెలిపాడు.

పెన్సిల్ ముల్లుపై చెక్కినచిహ్నం (ఇన్‌సెట్‌లో వెంకటేష్)

సమస్యలు తెలుసుకుంటున్న అనిత

హోం మంత్రి అనితకు వినతులు

ప్రజాశక్తి -నక్కపల్లి: హెూంమంత్రి వంగలపూడి అనితకు పలువురు పలు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. నక్కపల్లి క్రిష్ టౌన్ షిప్‌లో ఆమె స్వగృహానికి రావడంతో గురువారం ఉదయం పెద్ద సంఖ్యలో ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. పలువురు వ్యక్తిగత సమస్యలతో వినతి పత్రాలను అనితకు అందజేశారు. ఇతర ప్రాంతాల నుంచి కూడా జనం తరలివచ్చారు.

కొత్త నేర చట్టాలకు సవరణలు అవసరం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : కొత్త నేర చట్టాలకు సవరణలు అవసరమని భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ సభ్యులు టి.శ్రీరామమూర్తి, జె.రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ చట్టాలు ఈ ఏడాది జూలై 1 నుండి అమలు జరుగుతున్నాయన్నారు. వాటివల్ల తలెత్తే పరిణామాలను వివరించారు.

కొనసాగుతున్న రవాణా శాఖ తనిఖీలు

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : రవాణా శాఖ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బస్సులు, ఆటోలపై తనిఖీలను అధికారులు ముమ్మరం చేశారు. గురువారం నగరంలోని వివిధ ప్రాంతాలలో నిర్వహించిన తనిఖీలలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న స్కూలు బస్సులు, స్కూలు ఆటోలపై కేసులు నమోదు చేశారు. 9 బస్సులపై కేసులు నమోదు చేశామని, మూడు బస్సులను సీజ్ చేసి తరలించామని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రాజరత్నం మీడియాకు తెలిపారు. ఈ తనిఖీలలో మోటారు వాహన తనిఖీ అధికారులు బి.రాజారావు, ఐ.మాధవి, కె.శ్రీనివాస్, ఎస్.శిరీషాదేవి, వై.లలిత తదితరులు పాల్గొన్నారన్నారు.

5న సబ్ కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్రంలో వివిధ రంగా లలో పనిచేస్తున్న కార్మికుల తొలగింపునకు నిరసనగా 5న పాడేరులో సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించ నున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ తెలిపారు. గురువారం పాడేరులో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్బి పోతురాజు, సహాయ కార్యదర్శి ఎల్ సుందర్రావుతో కలిసి విలేకరుల సమావేశంలో చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, ఈ ధర్నాకు కార్మిక వర్గాలు కదిలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన మహాకూటమి ప్రభుత్వం వివిధ పథకాలలో పనిచేస్తున్న స్కీం వర్కర్లపై కక్ష కట్టి పథకం ప్రకారం తొలగింపులకు గురి చేస్తుందని మండిపడ్డారు. వాస్తవానికి స్కీం వర్కర్లు అంగన్వాడి, ఆశ, సిహెచ్ డబ్ల్యులు ,మధ్యాహ్నం భోజనం, వెలుగు సిబ్బంది, ఏ ప్రభుత్వానికి బానిసలు కాదని తెలిపారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా చెప్పిన పని తప్పకుండా భారమైనా చేస్తున్నారని, వీరిని గుర్తించి జీతభత్యాలు పెంచడమే కాకుండా కనీస వేతనాలు అమలు చేయలేదన్నారు.

ఘనంగా ప్రజాశక్తి 44వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖపట్నం

ప్రజాశక్తి 44వ వార్షికోత్సవం సందర్భంగా ప్రచురించిన ప్రత్యేక సంచికను జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్ గురువారం ఉదయం 11 గంటలకు జివిఎంసి కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. సంచిక బాగుందని కితాబిచ్చారు. కార్యక్రమంలో ప్రజాశక్తి బ్యూరోచీఫ్ ఎన్.మధుసూదనరావు, ఎడివిటి విభాగం ఇన్‌ఛార్జి జి.రాజేశ్వరరెడ్డి, సిబ్బంది జి.సంతోష్, బి.దేముడుబాబు, ఎస్ఎస్.రవికుమార్, డి.రాజేష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న జివిఎంసి కమిషనర్ సంపత్ కుమార్

స్కూల్ పేరెంట్స్ కమిటీ ఎన్నికల నోటిఫికేషన్

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ ఎన్నికలకు గురువారం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆయా ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో ఎన్నికల నోటిఫికేషన్ ప్రదర్శించినట్లు ఎంఈఓ కే నరేష్ వెల్లడించారు.పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, సభ్యుల ఎన్నికకు సంబంధించి నోటిఫికేషన్, ఓటర్ల జాబితాను ఆయా పాఠశాలలో నోటీసు బోర్డు నందు ప్రదర్శించారు. ఓటర్ల జాబితాపై ఆగస్టు 5వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అభ్యంతరాలు స్వీకరణ, అదే రోజు తుది జాబితా ప్రదర్శన ఉంటుంది. ఆగస్టు 8వ తేది ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు .

స్కూల్ కమిటీల ఎన్నికల సందడి

కోటవురట్ల: మండలంలోని మండల పరిషత్, జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించనున్న స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ (ఎస్ఎంసి)ఎన్నికల సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల వాతావరణం నెలకొంది. ఈ మేరకు నోటిఫికేషన్ గురువారం విడుదల కావడంతో మండల విద్యాశాఖ అధికారి రామారావు ఇచ్చిన సమాచారం మేరకు... మండలంలో 45 మండల పరిషత్తు పాఠశాలలు, 4జిల్లా పరిషత్ పాఠశాలలు, 1 ప్రభుత్వ పాఠశాల, సహా కేజీబీవీ పాఠశాలలో ఈనెల 8న స్కూల్ మేనేజ్ కమిటీ అధ్యక్షుల ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని పాఠశాలలో నోటీసు బోర్డులో ప్రదర్శించామని, ఎన్నికల నియమాలళి అనుసరించి ప్రధానోపాధ్యాయులు ఆ రోజు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఇదిలా ఉండగా గ్రామీణ ప్రాంతాల్లో కూటమి నాయకులు, వైసిపి నాయకులు ఆధిపత్య పోరుకై సిద్ధమవుతున్నారు.

నక్కపల్లిలో నోటిఫికేషన్ ప్రదర్శిస్తున్న హెచ్ఎం, టీచర్స్

పెట్టుబడి సాయం కోసం.. రైతన్నల ఎదురుచూపు

- ఆ ఊసే ఎత్తని కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి -కోటవురట్ల: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై దాదాపు నెలరోజులు అయ్యింది. ఇటీవల అల్పపీడనం ప్రభావంతో దాదాపుగా వర్షపాతం ఆశాజనకంగా ఉంది. ఎన్నికల ప్రకటనలో భాగంగా కూటమి ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద ఏటా రూ. 20000 ప్రకటించిన సంగతి తెలిసిందే. గతంలో వైసిపి ప్రభుత్వం కేంద్ర నిధులతో కలిపి రూ.15000 మూడు దఫాలుగా అందజేసేది. ఖరీఫ్ ఆరంభంలో మొదటి విడత అందజేయడంతో ఒక కాస్త ఊరట లభించేది.

కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండు నెలలు పూర్తి కావస్తున్నా నేటికీ పెట్టుబడి సాయం ఊసే ఎత్తక పోవడంతో రైతన్నలు ప్రభుత్వ ప్రకటన కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం 2000 రైతన్నల ఖాతాలో జమ చేయగా కూటమి ప్రభుత్వం ఖరీఫ్‌కు ఎంత పెట్టుబడి సాయం అందిస్తుంది అనేది తేలాల్సి ఉంది. మండల వ్యాప్తంగా వరి, పత్తి, కూరగాయలు సహా ఉద్యానవన పంటలు జీడి, మామిడి పండించుకునే రైతులు ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

మండల వ్యాప్తంగా గత లెక్కల ప్రకారం 11,115 మంది రైతులకు రైతు భరోసా అందేది. ఇదిలా ఉండగా మండలంలో అగ్రికల్చర్ భూమి 1860 హెక్టార్లు, హార్టికల్చర్ 4200 హెక్టార్లు ఉంది. ఇందులో వరి 1654 హెక్టర్లు, కూరగాయలు 20హెక్టార్లు, పత్తి 44 హెక్టార్లు, పామ్ ఆయిల్ 256 హెక్టార్ల సాగు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. మండలంలో చాలా మంది వరకు కౌలుకు రైతులు సాగు చేసుకుంటున్నారు. భూ యజమానులతో పాటు దేవాదాయ, ఒక్ఫ్ భూములు, అటవీ భూములు సహా కౌలు రైతులకు రైతు భరోసా ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే చాలా మంది రైతులు వరి నారుమడులు, కూరగాయలు వంటి పంటలు వేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు దాటి రెండు నెలలు కావస్తోంది. ఇంతవరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో సాగు ఖర్చుకు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.

మాంగనీస్ దిగుమతిలో విశాఖ పోర్టు సరికొత్త రికార్డు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో:

విశాఖ పోర్టు సరుకు రవాణాలో సరికొత్త రికార్డు నెలకొల్పింది. జులైలో అత్యధిక స్థాయిలో మాంగనీస్‌ను దిగుమతి చేసుకుని ఆ రికార్డు సృష్టించింది. జులై 2024లో 15 నౌకల ద్వారా 5,66,301 మెట్రిక్ టన్నుల మాంగనీస్‌ను దిగుమతి చేయడం ద్వారా గత రికార్డులన్నిటినీ పోర్టు బ్రేక్ చేసింది. గత మేలో 17 నౌకల ద్వారా దిగుమతి చేసుకున్న 4,37,270 మెట్రిక్ టన్నుల మాంగనీస్‌నే ఇప్పటివరకూ ఒక నెలలో పోర్టు దిగుమతి చేసుకున్న సరుకు రికార్డుగా ఉండేది. ఇప్పుడు దాన్ని అధిగమించింది. విశాఖ పోర్టు అథారిటీ (విపిఎ) 90 ఏళ్ల చరిత్రలో ఇదో మైలురాయిగా నిలిచింది. పోర్టు ఆ ఘనతను సాధించడం పట్ల పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో సంతోషం వ్యక్తం చేస్తూ ట్రాఫిక్ మేనేజర్, పోర్టు సిబ్బంది, ఉద్యోగ, కార్మికుల కృషి వల్లనే ఇది సాధ్యపడిందని అభినందించారు. ఇదే కృషిని కొనసాగించి 2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన 90 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా లక్ష్యాన్ని చేరుకుంటామన్న విశ్వాసాన్ని ఈ సందర్భంగా వ్యక్తం చేశారు.

ఫిల్మ్ యాక్టింగ్ వర్క్ షాప్ ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వైజాగ్ షార్ట్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ మూడు రోజులు పాటు నిర్వహిస్తున్న ఫిల్మ్ యాక్టింగ్ వర్క్ షాప్ గురువారం ప్రారంభమైంది. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో మొదటిరోజు ఎఫ్ఎం బాబాయ్ (దాడి త్రినాథరావు) పాల్గొని శిక్షణకు హాజరైన వారికి నటనలో తర్ఫీదు ఇచ్చారు. వైజాగ్ షార్ట్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అశ్రఫ్ అధ్యక్షతన మొదటి రోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. నగరం నుండే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా మొత్తం 70 మంది కళాకారులు పాల్గొన్నారని అసోసియేషన్ కార్యదర్శి ఎం.ఎల్లాజీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి ఉమామహేష్, కుమార్ రాజ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎఫ్ఎం బాబాయ్